

బాపట్ల : జమ్ములపాలెం రోడ్డులో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

పునాదులకే.. సంబరాలా?

- మెడికల్ కళాశాల శంకుస్థాపనకు రెండేళ్లు దాటాయి..
- 2023 చివరికల్లా పూర్తి చేస్తామన్న పాలకుల మాటలు ప్రగల్భాలే
- పునాదుల దశలోనే వైద్య కళాశాల పనులు
- 2025 - 26కల్లా అందుబాటులోకి అంటూ కొత్త పల్లవి
- కేటాయించిన స్థలం మీద పలు ఆరోపణలు

శంకుస్థాపనలప్పుడు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించడం.. తర్వాత వాటిని అటకెక్కించడం ప్రస్తుత ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్యలా తయారైంది. 2021 మే చివరన పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సమీపంలో, బాపట్ల పట్టణ శివారులోని జమ్ములపాలెం రోడ్డులో మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు టీచింగ్ హాస్పటల్‌కు సీఎం జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. రెండేళ్లలోపు మెడికల్ కళాశాల, ఆసుపత్రి పూర్తి చేస్తామని ఆనాడు ఎంతో గొప్పలు చెప్పినా అవి ఆచరణలో కనిపించడం లేదు. నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. శంకుస్థాపన చేసిన తర్వాత రెండేళ్ల వరకు అటువైపు పాలకులు కన్నెత్తి చూడలేదు. ఆరు నెలల క్రితం నుంచే వాటి పనులు ప్రారంభిం చారు. ప్రస్తుతానికి ఫిల్లర్ల దశలో మెడికల్ కళాశాల పనులు ఉన్నాయి. ఇప్పుడు 2025 - 26 కల్లా మెడికల్ కళాశాల సేవలను అందుబాటులోకి తెస్తామనే మాటలు చెబుతూ ఎన్నికల సమీపిస్తున్న వేళ మరో గారడీకి తెరలేపారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

30 శాతమే పనులు పూర్తి..

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5: పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సమీపంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మెడికల్ కళాశాల మొత్తం రెండున్నర లక్షల చదరపు అడుగులలో నాలుగు బ్లాక్‌లలో నిర్మాణాలు చేయాల్సి వుండగా శ్లాబులు పూర్తయ్యాయి. మూడు బ్లాక్‌లలో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మెడికల్ ఆసుపత్రి నిర్మాణం కూడా ఆరు బ్లాక్‌లుగా విభజించగా ఐదు బ్లాక్‌లు కొంతమేర పనులు పూర్తయ్యాయి. మొత్తం మీద మెడికల్ కళాశాల, ఆసుపత్రి భవన నిర్మాణాలు రెండు సంవత్సరాల 8 నెలలకు 30 శాతమే పూర్తయ్యాయి. మొత్తం భవనాలకు శ్లాబులు వేయగా లోపల పార్టీషియన్‌లు, ఇంకా కొంతపని చేయాల్సి వుంది. ఈ ఏడాది ఆఖరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ 30 శాతం పనులు చేసేందుకే మూడేళ్లు గడిస్తే మిగిలిన 70శాతం పనులు చేసేం దుకు ఇంకెన్నేళ్లు పడుతుందో. మెడికల్ కాలేజి ముందుభాగం వరకు త్వరితగతిన మొక్కుబడిగా పనులు పూర్తిచేసి రంగులు వేస్తున్నారు. ఎన్నికల కోడ్ రాకమునుపే వర్చువల్ విధానంలో మెడికల్ కళాశాలను సీఎం జగన్‌చే ప్రారంభించేం దుకు నేతలు సన్నద్ధమవుతున్నారు.



పిడుగురాళ్ళ: బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల

బాపట్ల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కిందట బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మెడికల్ కాలేజీల నిర్మాణాలకు సీఎం జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వం అందుబాటులోకి తెస్తానన్న మెడికల్ కళాశాల అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలకు అత్యవసర వైద్యం కష్టాలు తప్పడం లేదు. బాపట్లలోని ఏరియా ఆసుపత్రిలో అత్యవసర వైద్యానికి కావాల్సిన సదుపాయాలు, నిపుణులైన డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రాణాలొదులుతున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగింది. గతేడాది టెన్త్ మూల్యాంకనం కోసం బాపట్ల వచ్చిన ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించగా తొలుత అతనిని ఏరియా ఆస్పత్రికే తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు రిఫర్ చేయగా మార్గ మధ్యంలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. సకాలంలో వైద్యం అంది ఉంటే ఆ ఉపాధ్యాయుడు బతికేవారని అభిప్రాయం అప్పుడు వ్యక్తమైంది. ప్రాణాపాయ సమయాల్లో బాపట్లలో వైద్యం అందకపోవడంపట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శంకుస్థాపన చేసిన వెంటనే..

మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేసిన వెంటనే పనులు మొదలుపెట్టి ఉంటే ఈ పాటికే ప్రజలకు సేవలు అందుబాటులోకి వచ్చేవని, కానీ ప్రభుత్వం రెండేళ్ల పాటు నిర్మాణం ఊసే ఎత్తలేదని ప్రజలు మండిపడుతున్నారు. పెరిగిన వైద్య అవసరాలకు తగ్గట్లు బాపట్లలో సదుపాయాలు లేవని, ఏరియా ఆసుపత్రిని జిల్లా వైద్యశాలగా మార్చే అంశం మీద కూడా పాలకులు దృష్టిపెట్టకుండా మెడికల్ కళాశాల అందుబాటులోకి వస్తోందంటూ మోసపూరిత ప్రకటనలకే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గడచిన ఆరు నెలల నుంచి మెడికల్ కళాశాల పనుల్లో కదలిక ప్రారంభమైంది. అంతకు ముందు వరకు అతీగతీ లేదు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజల నుంచి వచ్చే విమర్శలు తప్పించుకోవడానికే పనులు మొదలుపెట్టారని చిత్తశుద్ధి ఉంటే ప్రారంభించిన సంవత్సరంలోనే నిర్మాణం చేపట్టేవారనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేయడం గమనార్హం.



పునాదుల్లోనే జమ్ములపాలెం రోడ్డులో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

కేటాయించిన స్థలంపై ఆరోపణలు

మెడికల్ కళాశాల నిర్మాణం కోసం బాపట్ల పట్టణ శివారులోని జమ్ములపాలెం రోడ్డులో 50 ఎకరాల స్థలం కేటాయించారు. ఓ దాత విరాళంగా ఆ భూమిని ఇచ్చారని చెబుతున్నారు. అదంతా అసైన్డ్ భూ మిగా ప్రభుత్వ రికార్డుల్లో నిక్షిప్తమై ఉంది. ఆ భూమే అసైన్డ్ అయినప్పుడు చేతులు మార్చుకున్న వ్యక్తి వాటిని వితరణగా ఇవ్వడమేంటో అన్నదానికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. ఈ భూమి కేటాయింపులో రియల్ ప్రయోజనాలే ఎక్కువగా పని చేశాయనే విమర్శలు ఉన్నాయి.

ప్రతిబంధకంగా ఎన్ఎంసీ ఆంక్షలు

ప్రభుత్వం సకాలంలో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టకపోవడం వల్ల కొత్త చిక్కు కూడా వచ్చిపడింది. ప్రతి పదిలక్షల జనాభాకు 100 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉండాలన్న జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) నిబంధనలు భవిష్యత్తులో ప్రారంభించబోయే వైద్య కళాశాలలకు గొడ్డలి పెట్టు కానుంది. మరో మూడేళ్లలో వీటి నిర్మాణం పూర్తయినా ఎన్ఎంసీ కొత్తగా తీసుకొచ్చిన ఆంక్షల వల్ల తరగతులు ప్రారంభం కావడం కూడా కష్టమేననే అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్త చేస్తున్నారు. ఇన్ని బాలారిష్టాలను దాటి బాపట్లలో మెడికల్ కళాశాల సేవలు అందుబాటులోకి రావాలంటే ఇంకెన్నాళ్లు ఎదురు చూడాలో అని ప్రజానీకం వాపోతోంది.

వైసీపీని నమ్ముకుంటే..

అట్రాసిటీ కేసు

- టీడీపీని వీడి వైసీపీలో చేరినందుకు సరైన గుణపాఠం
- 12వ వార్డు వైసీపీ కౌన్సిలర్ రాజీనామా

గురజాలటౌన్, ఫిబ్రవరి 5: వైసీపీ గెలుపుకోసం ఎంతో కృషి చేశామని, పార్టీలో వర్గపోరు తయారై కేసులు పెట్టించుకొని ఎన్నో కష్టాలు పడ్డామని, అలాంటి పార్టీ ఇప్పుడు మాపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు బనాయిస్తోందని 12వ వార్డు వైసీపీ కౌన్సిలర్



రాజీనామా అందజేస్తున్న కౌన్సిలర్ అనిత

మహంకాళి అనిత నీలంరాజు ఆవేదన వ్యక్తం చేశారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రాజీనామాతో ఆయన బాటలో నడిచేందుకు వైసీపీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వ్యాఖ్యలకు మనస్థాపం చెంది మున్సిపల్ అధికారులకు కౌన్సిలర్ అనిత తన రాజీనామా పత్రాన్ని అందించారు. రాజీనామా అనంతరం మాట్లాడుతూ 2017లో అధికారంలో ఉన్న టీడీపీని వదిలి వైసీపీలో చేరానని, అలా చేరినందుకు ఇప్పుడు ఎంతగానో బాధపడుతున్నామన్నారు. వైసీపీ బలోపేతానికి ఎంతో కృషి చేసి తన వార్డులో ఎప్పుడూ రాని మెజార్టీని తీసుకొచ్చామన్నారు. తనను పోలీస్‌స్టేషన్లో వేసి కొట్టించడంతో బాధ కలిగిందని నీలంరాజు తెలిపారు. తక్షణమే తమ వార్డుకు ఉప ఎన్నికలు జరిపితే తాను అఖండ మెజార్టీతో గెలుస్తానని అనిత ధీమా వ్యక్తం చేశారు.

ఎన్నికల వేళ.. ఎత్తుగడ

- పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్లు అంటూ హడావిడి
- పది సంవత్సరాల తరువాత పూర్తి హక్కులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 5: పేదలకు ఇచ్చిన సెంటు నుంచి సెంటున్నర స్థలాలకు రిజిస్ట్రేషన్ పేరుతో ప్రభుత్వం కొత్త ఎత్తుగడలకు దిగింది. వారం రోజు లుగా అవగాహన లేని సచివాలయ సిబ్బంది జగనన్న ఇళ్ళ రిజిస్ట్రేషన్‌లకు పడరాని పాట్లు పడుతున్నారు. సత్తెనపల్లి పట్టణ వాసులకు చెందిన 2,145, రూరల్ గ్రామాలకు చెందిన 820 మంది ఇళ్ళ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఆగమేఘాల మీద జరుగుతున్న ఈ రిజిస్ట్రేషన్‌లతో పేదలకు ఇప్పుడు ఒరిగిందేమి లేదు. పది సంవత్సరాల తరువాత అమ్మే హక్కులు వస్తాయి. ఈ తతంగం అంతా పేదల ఓట్లకు గాలం వేయటానికేనని విమర్శలు వినిపిస్తు న్నాయి. ఇప్పటికే సత్తెనపల్లి పట్టణ, మండలంలో ఇళ్ళ నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. వైసీపీ అధికా రంలోకి వచ్చిన తరువాత ఆర్భాటంగా మూడు వేల మందికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేసినప్పటికీ వెయ్యి లోపు గృహ నిర్మాణాలను పూర్తి చేయలేక అధికారులు చతికలపడ్డారు. సార్వత్రిక ఎన్నికలు రెండునెలల్లో ఉండటంతో ప్రభుత్వం కొత్త ఎత్తుగడలకు తెరలేపింది. పేదల ఇళ్ళను రిజిస్ట్రేషన్ చేసి కోట్లు దండ కొనేందుకు ఈ ఎత్తుగడకు దిగిందనే విమర్శలు ప్రతిపక్షాల నుంచి వినిపిస్తున్నాయి. అసలే ఇళ్ళు కట్టుకోలేక నిరాశతో ఉన్న పేదలకు ఆర్థిక సాయం చేయాల్సిన ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్ బొమ్మతో ముద్రించిన ఇంటి పట్టాలు కాకులో, గద్దలో తన్నుకు పోతున్నట్టుగా ఇళ్ళ రిజిస్ట్రేషన్ పేర పేదల ఓట్లకు గాలం వేయటానికి జగన్నాటకమని ప్రతి పక్షాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

మొరాయిస్తున్న సర్వర్లు...

వారం రోజులుగా పేదల ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టినా సర్వర్లు మొరాయిస్తున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులు, సచివాలయాల సిబ్బందికి శిక్షణ ఇచ్చే పనిలో పడ్డారు. ఆదివారం కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయం తెరచి సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది ఉండటం గమనార్హం.రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా లాగిన్ ఐనా ఎంప్లాయ్ ఐడీ రాకుండా పోవటం, పాస్‌వర్డ్, గ్రామాల



జగనన్న ఇళ్ల స్థలాలు

పేర్లు సెలెక్ట్ కాక పోవటంతో పాటు సర్వర్ మొరాయింపు తోడవ్వటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నత్తనడకన సాగుతున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అనుసంధానంగా సచివాలయాల్లో జరుగుతున్న జగనన్న ఇళ్ళ రిజిస్ట్రేషన్‌లకు ఒక్కటే సర్వర్ కావటంతో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో క్రయ, విక్రయాలు సక్రమంగా జరగక బాధితులు లబోదిబో మంటున్నారు. సర్వర్ల మొరాయింపుతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తుంది. దీనిపై సత్తెనపల్లి మునిసిపల్ కమిషనర్ షమ్మిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన 2,145 మంది లబ్ధిదారులకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, నాలుగు రోజులుగా సచివాలయాల పరిధిలో సర్వర్ సమస్య కారణంగా 20కంటే ఎక్కువ రిజిస్ట్రేషన్‌లు కాలేదని తెలిపారు. సత్తెనపల్లి రూరల్ పరిధిలో 820 ఇళ్ళ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా వాటిలో నాలుగు వందల వరకు రిజిస్ట్రేషన్‌లు అయినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

రుణ భారం

ఉసురు తీసింది

- భర్త, పిల్లలకు టీలో ఎలుకల మందు కలిపి ఇచ్చిన తల్లి
- తాను కూడా ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ ఇద్దరు చిన్నారుల మృతి
- మాచర్ల మండలం నారాయణరెడ్డిపురంలో ఘటన

మాచర్ల, ఫిబ్రవరి 5: అప్పులు ఓ కుటుంబంలో చిచ్చుపెట్టాయి.. పొలం అమ్మి అప్పులు తీర్చుకుందామని భర్త చెప్పగా భార్య అందుకు అంగీకరించలేదు.. ఈ క్రమంలో దంపతులు తరచూ గొడవలు పడుతున్నారు.. కాగా ఆదివారం మధ్యాహ్న సమయంలో భర్త, పిల్లలకు టీలో ఎలుకల మందు కలిపి తాగించడమేగాక తాను కూడా తాగింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు.

వివరాల్లోకి వెళితే.. మండలంలోని నారాయణరెడ్డిపురానికి చెందిన రమావత్ రవినాయక్, తెలంగాణ రాష్ట్రం దామరచర్ల రాష్ట్రం నరసాపురానికి చెందిన వసంత భార్యాభర్తలు. వీరికి రమావత్ భానుప్రకాష్(12), కార్తీక్ ప్రకాష్, రెండున్నరేళ్ల కవలలు ఈశ్వర్, ఉమేశ్వర్‌లు సంతానం. వీరంతా నారాయణరెడ్డిపురంలో ఉంటున్నారు. రవినాయక్ హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్ గా జీవనం సాగిస్తూ వారానికోవారు నారాయణరెడ్డిపురం వస్తూ వెళ్తుంటాడు. అయితే అప్పులు పెరిగిపోవడంతో తమకున్న ఐదెకరాల పొలంలో రెండు ఎకరాలు అమ్మి అప్పులు తీర్చుదామని భార్యతో రవినాయక్ అన్నారు. ఇందుకు ఆమె అంగీకరించలేదు. దీంతో భార్యాభర్తలు కొద్ది రోజులుగా తర చూ గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో వసంత ఆది వారం మధ్యాహ్నం సమయంలో భర్త తోపాటు కుమారులు భానుప్రకాష్, ఈశ్వర్, ఉమేశ్వర్‌లకు టీలో ఎలుకల మందు కలిపి ఇచ్చింది. సాయంత్రానికి ముగ్గురు పిల్లలు వాంతులు చేసుకోవడంతో మాచర్ల పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పిల్లలతో కలిసి భార్యాభర్తలు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. ఈలోగా భార్యాభర్తలకు కూడా వాంతులు అవుతుండడంతో రవికుమార్ తన భార్య వసంతను నిలదీశాడు. దీంతో వసంత జరిగిన విషయమంతా చెప్పింది. దీంతో ఆ ఐదుగురిని నరసరావుకుపేటకు వైద్యులు రిఫర్ చేశారు. మార్గ మధ్యంలో ఈశ్వర్ మరణించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో భానుప్రకాష్‌ను నరసరావుపేట నుంచి నల్గొండకు రిఫర్ చేశారు. మార్గమధ్యంలో భానుప్రకాష్ కూడా మరణించాడు. కాగా భార్యాభర్తలు, ఉమేశ్వర్ నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఏడేళ్ల కార్తీక్ ప్రకాష్ అమ్మమ్మ ఊరైన నరసాపురంలో ఉంటున్నాడు. దీనిపై విజయపురిసౌత్ ఎస్ఐ కొండారెడ్డి కేసు నమోదు చేశారు.



అందరం కలిసి అభివృద్ధికి కృషి చేద్దాం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు
- మక్కెనను మర్యాద పూర్వకంగా కలిసిన జీవీ
- శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానం



మక్కెనకు శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు

5లో..

నిరుద్యోగులకు..నిరాశే


- డిజిటల్ సంకల్పం.. అటకెక్కింది
- ఒక్క వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీ పూర్తి కాలేదు...

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్లె సీమల్లో సాంకేతిక విప్లవం తీసుకురావాలని ప్రభుత్వం రెండేళ్ల కిందట నిర్ణయించింది. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థు లకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన విద్యాసామగ్రిని అందుబాటులోకి తీసుకురా వాలని సంక ల్పించింది. సాఫ్ట్ వేర్ రంగంలో ఉద్యోగాలు చేస్తున్న యవత కు వేగంగా పనిచేసే అపరిమిత ఇంటర్ నెట్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని గొప్పగా ప్రకటించింది. ఇందుకు అవసరమైన భవనాల నిర్మాణం చేపట్టింది. వీటి నిర్మా ణం అడుగు ముందుకు పడలేదు. నిధుల కొరతతో ప నులు నిలిచి పోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్క భవన నిర్మాణం పూర్తి కాలేదని సదరు శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

నిర్మాణాల్లో ఎటువంటి కదలిక లేదు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.26.28 కోట్లతో 165 చోట్ల వైఎస్ఆర్ డిజిటల్ గ్రంథాలయ భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. పంచాయతీ రాజ్ శాఖకు నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. ఒక్కో గ్రంథాలయం రూ.16 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయాలని అంచనాలను రూపొందించారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రతి కేంద్రానికి మూడు కంప్యూటర్లు, ప్రింటర్, స్కానింగ్, నిరంతరం ఇంటర్‌నెట్ సేవలు, ఇన్వర్టర్లు, అభ్యర్థులకు కావాల్సిన స్టడీ మెటీరియల్, దిన, వార పత్రికలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ సంకల్పం అటకెక్కింది. కనీసం ఒక్క భవనం కూడా పూర్తికాలేదు. ఒక్క లక్ష రూపాయలు కూడా ఖర్చు చేయలేదు. నిర్మాణ పనుల్లో ఎలాంటి కదలిక లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.



నిలిచిన భవనాల నిర్మాణం..

పల్లె చెంతకు సాంకేతిక సేవలొస్తాయని ఆశించిన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు నిరాశే మిగిలింది. డిజిటల్ గ్రంథాలయ భవనాల నిర్మాణం విషయంలో తొలుత హడావుడి చేసిన అధికార యంత్రాంగం నిధుల కొరతతో మిన్నకుంది. ఉపాధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడంతోనే భవనాల నిర్మాణం నిలిచిపోయిందని చెప్పవచ్చు. ఇప్పట్లో ఈ పనులు చేపట్టే పరిస్థితి లేదని తెలుస్తోంది. మూడు దశల్లో 2023 జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్ణయించినా సాధ్యం కాలేదు.

డాక్టర్



బ్రెయిన్ ట్యూమర్స్

మెదడు, వెన్నుపాములో ట్యూమర్ల లక్షణాలు వ్యాధి నిర్ధారణను తప్పు దారి పట్టిస్తాయి. దాంతో మొదట్లోనే వాటిని కచ్చితంగా గుర్తించి, చికిత్స అందించడం ఆలస్యమవుతూ ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే ఈ ట్యూమర్ల లక్షణాల పట్ల లోతైన అవగాహన పెంచుకోవాలి.



మెదడు కణితులకు సమర్థమైన చికిత్సలు

వెన్నుపాములో ట్యూమరు వల్ల మూత్రవిసర్జన క్రమం తప్పవచ్చు. మెదడులో కణితుల వల్ల చేతులు, కాళ్లలో నిస్సత్తువ తగ్గవచ్చు. కానీ మనం ఈ లక్షణాలు తలెత్తే అవయవాల్లోనే సమస్య ఉందని భావిస్తాం. సదరు వైద్యులను సంప్రతిస్తూ ఉంటాం. కానీ నిజానికి మెదడు, వెన్నుపాము, ఇతరత్రా నాడీసంబంధ సమస్యలన్నీ ఇతరత్రా శారీరక వ్యవస్థలతో ముడిపడి ఉంటాయి. మెదడు సంబంధ ట్యూమర్లలో మెనింజియోమా, మెటాస్టాసిస్ అనే రెండు రకాల ట్యూమర్లు ప్రధానంగా కనిపిస్తూ ఉంటాయి. ఈ ట్యూమర్లను కేన్సర్ వైద్యులు చికిత్స చేయరు. ఎమ్మారైలో గడ్డ ఉందని కనిపెట్టినప్పుడు న్యూరాలజిస్టుల దగ్గరకే పంపిస్తూ ఉంటారు. అయితే మెదడు లేదా వెన్నుపాములో పెరిగే గడ్డలన్నీ కేన్సర్ గడ్డలే అయి ఉండవలసిన అవసరం లేదు. 12 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో లేదా 55 నుంచి 60 ఏళ్ల పెద్దల్లో బ్రెయిన్ ట్యూమర్లు తలెత్తవచ్చు. పిల్లల్లో పుట్టుకతోనే మెదడు కణాల్లో సమస్యల కారణంగా ట్యూమర్లు తలెత్తితే, పెద్దల్లో మెటాస్టాసిస్‌లు, మెనింజియోమాల తరహా ట్యూమర్లు తలెత్తుతూ ఉంటాయి. మెనింజియోమా బినైన్ ట్యూమరు. అప్పుడప్పుడూ తలనొప్పితో వేధించే ఈ ట్యూమర్లతో ప్రమాదం ఉండదు. అరుదుగా కొందర్లో 70 ఏళ్ల వయసుకు అవే ట్యూమర్లు పెరిగి ఫిట్స్ రావడం, మాట పడిపోవడం లాంటి లక్షణాలు కనిపించవచ్చు. అప్పుడు సర్జరీతో సమస్యను పూర్తిగా సరిదిద్దవచ్చు. ట్యూమర్లలో నాలుగు గ్రేడ్లు ఉంటాయి. మొదటి, రెండవ గ్రేడ్‌కు చెందిన ట్యూమర్లను సర్జరీతో తొలగిస్తే, సమస్య సమసిపోతుంది. కానీ మూడు లేదా నాల్గవ గ్రేడ్‌లో ఉన్న ట్యూమర్లు కేన్సర్ ట్యూమర్లు. సర్జరీ చేసినా ఇవి తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది. కాబట్టి సర్జరీ తర్వాత రేడియేషన్, కీమోథెరపీలు అవసరమవుతాయి.

> మూడు లేదా నాల్గవ గ్రేడ్‌లో ఉన్న ట్యూమర్లు కేన్సర్ ట్యూమర్లు. సర్జరీ చేసినా ఇవి తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది. కాబట్టి సర్జరీ తర్వాత రేడియేషన్, కీమోథెరపీలు అవసరమవుతాయి.

ఈ లక్షణాల పట్ల అప్రమత్తం

మెదడు ట్యూమర్ల ప్రధాన లక్షణం తలనొప్పి. దీంతో పాటు గడ్డ తలెత్తిన ప్రదేశాన్ని బట్టి లక్షణాలు మారుతూ ఉంటాయి. తలనొప్పి, ఫిట్స్, కాళ్లూ చేతులు మొద్దుబారడం, స్పర్శ కోల్పోవడం ప్రధాన లక్షణాలు. అలాగే...


- **మెదడులోని ఇన్సులార్ ప్రాంతం:** తలనొప్పి, కడుపులో తిప్పడం
- **మెదడు ముందు లేదా మధ్య ప్రాంతం:** జ్ఞాపకశక్తి తగ్గడం, ప్రవర్తనలో మార్పులు, చూపు మందగించడం
- **మెదడు వెనక భాగం:** రుచి, వాసన, స్పర్శలో సమస్యలు తలనొప్పితో పాటు ఇతరత్రా లక్షణాలు కూడా వేధిస్తూ ఉంటే ఆలస్యం చేయకుండా నాడీసంబంధ వైద్యులను కలవాలి.

ఈ పరీక్షలతో...

ఎమ్మారై స్కాన్‌తో నాడీసంబంధ ట్యూమర్లను కచ్చితంగా కనిపెట్టవచ్చు. ఈ స్కాన్‌లోనే యాంజియోగ్రామ్, వీనోగ్రామ్, కాంట్రాస్ట్ స్టడీలను చేపట్టి, ట్యూమర్‌ను కచ్చితంగా అంచనా వేసి, చికిత్సను నిర్ధారించడం జరుగుతుంది.

చికిత్స ఇలా...

క్లిష్టమైన ప్రాంతంలో లేని, రెండు సెంటీమీటర్ల కంటే చిన్న గడ్డలకు సర్జరీ అవసరం ఉండదు. ఫాలోఅప్‌లో గమనించుకుంటూ పెరుగుతుందనుకున్నప్పుడు రేడియేషన్‌తో చికిత్స చేయవచ్చు. క్లిష్టమైన ప్రాంతంలో ఉన్న గడ్డలకు రేడియేషన్‌తో హాని ఎక్కువ కాబట్టి వాటిని సర్జరీ చేసి తొలగించవలసి వస్తుంది. సర్జరీ తర్వాత గడ్డను అనాలసిస్ చేసి, గ్రేడ్‌ను బట్టి రేడియేషన్ లేదా కీమోథెరపీని వైద్యులు సూచిస్తారు. మొదటి రెండు దశల ట్యూమర్లకు, ప్రతి మూడు, ఆరు, 12 నెలలకోసారి ఎమ్మారై చేసుకుంటూ గడ్డను గమనిస్తూ ఉండాలి. పెరుగుతూ ఉంటే సర్జరీ చేయక తప్పదు. మూడు, నాలుగు దశల్లోని ట్యూమర్లను సర్జరీతో తొలగించిన తర్వాత, రేడియేషన్ కూడా అవసరమవుతుంది. తర్వాత కూడా వైద్యులను తరచూ కలుస్తూ ఉండాలి.



> మెదడు సర్జరీపరంగా అత్యాధునిక సాంకేతికతలు అందుబాటులోకొచ్చాయి. వీటితో 80 నుంచి 90% మేరకు విజయవంతమైన ఫలితాలను రాబట్టుకోవచ్చు. ప్రస్తుతం మైక్రోస్కోపిక్ సర్జరీలో భాగంగా ఇమ్యునోఫ్లోరసెంట్ విధానాన్ని అనుసరిస్తూ, రక్తనాళం ద్వారా రంగు పదార్థాన్ని మెదడులోకి పంపించి, ట్యూమర్‌ను స్పష్టంగా చూడగలిగే చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. న్యూరో మానిటరింగ్ ద్వారా క్లిష్టమైన ప్రదేశాల్లోని గడ్డలను కూడా జాగ్రత్తగా తొలగించే వీలుంది. అలాగే చిన్న ట్యూమర్లను తొలగించే క్యూసా మిషన్లు కూడా ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి ఇలాంటి ఆధునిక చికిత్సలతో మెదడులోని ఇతర ప్రాంతాలు దెబ్బతినకుండా ట్యూమర్‌ను సమర్థంగా తొలగించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలను సాధించవచ్చు.

డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి
కన్సల్టెంట్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



మీకు తెలుసా?



బ్రేక్‌ఫాస్ట్ మానేయడం మంచిదే!

రోజు మొత్తంలో అత్యంత ముఖ్యమైన భోజనం, బ్రేక్‌ఫాస్ట్ అని మనం చిన్నప్పటి నుంచీ వింటూ ఉన్నాం. కానీ బ్రేక్‌ఫాస్ట్‌ను స్కిప్ చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని తాజా అధ్యయనాలు చెప్తున్నాయి.

రాత్రి భోజనం తినడానికీ ఉదయం నిద్ర లేవడానికీ మధ్య ఉండే విరామ సమయంలో మన శరీరం రాత్రి తిన్న భోజనం ద్వారా అందిన క్యాలరీలను ఖర్చు చేసుకుంటుంది. అయితే అదే విరామ సమయాన్ని మరికొంత పొడిగిస్తే, ఖర్చు చేయడానికి సరిపడా క్యాలరీలు లేక మన శరీరం కొవ్వును కరిగించుకోవడం మొదలు పెడుతుంది. అయితే ఆ విరామ సమయంలో ఆకలితో కలిగే పదార్థ వ్యామోహాలు, ఎమోషనల్ ఈటింగ్‌లకు చెక్ పెడుతూ ఉండాలి. దీర్ఘ సమయాల పాటు శరీరానికి ఆహారం అందించకపోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఇవే!

- **వ్యాధుల నుంచి రక్ష:** టైప్2 మధుమేహం, గుండె జబ్బులు, వయసుతో సంబంధం ఉన్న న్యూరోడీజెనరేటివ్ డిజార్డర్లు, ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్, పలు రకాల కేన్సర్ల నుంచి రక్షణ పొందవచ్చు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో అధిక రక్తపోటు అదుపులోకొస్తుంది. విరామ సమయంలో గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది.
- **బరువు తగ్గొచ్చు:** మెటబాలిజంను పెంచడం ద్వారా బరువు తగ్గడం మీ లక్ష్యమైతే, దీనికీ ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తినకపోడానికీ ఎటువంటి సంబంధం ఉండదు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో మెటబాలిజం కిక్‌స్టార్ట్ అవుతుందనేది అపోహ మాత్రమే!
- **శక్తి పెరుగుతుంది:** బ్రేక్‌ఫాస్ట్‌తో అందే క్యాలరీల మీద కోత విధిస్తే, నీరసం బదులుగా శక్తి సమకూరుతుంది. ఇందుకు కారణం శరీరం సురక్షితమైన కీటోజెనిక్ స్థితిలోకి ప్రవేశించడమే!
- **ఆటోఫజీ:** కణాల వ్యర్థాలను శుభ్రం చేసే ప్రక్రియ ఆటోఫజీ. ఈ ప్రక్రియ జరగనప్పుడు పైబడే వయసుతో ముడిపడి ఉండే ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. ఆహారం తీసుకోనప్పుడు, ఆటోఫజీ వల్ల కణ శుభ్రత పెరుగుతుంది.
- **అప్రమత్తత:** ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మానేయడం వల్ల మానసిక అప్రమత్తత, ఏకాగ్రతలు పెరుగుతాయి.
- **ఇన్సులిన్ సెన్సిటివిటీ:** ఫాస్టింగ్ గ్లూకోజ్, ఫాస్టింగ్ ఇన్సులిన్, లెప్టిన్‌లు తగ్గి ఫలితంగా ఇన్సులిన్ రెసిస్టెన్స్ కూడా తగ్గుతుంది.
- **ఇన్‌ఫ్లమేషన్:** మధుమేహం, మల్టిపుల్ స్క్లెరోసిస్, ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ సిండ్రోమ్‌లతో ముడిపడి ఉండే ఇన్‌ఫ్లమేషన్ ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో తగ్గుతుంది.

ఈ వ్యాయామంతో గుండె పదిలం

ఫిట్‌నెస్



గుండె వేగం పెంచే వ్యాయామాలతోపాటు గుండెకు విశ్రాంతినిచ్చే వ్యాయామాలు చేయడమూ అవసరమే! నిత్యం శరీరమంతా రక్తాన్ని పంప్ చేస్తూ అలసిపోయే గుండెకు నిద్రలో తప్ప విశ్రాంతి దొరకదు. ఆ భంగిమలో కూడా గుండె మీద అంతో కొంత ఒత్తిడి ఉంటూనే ఉంటుంది. అయితే రక్తప్రసార వేగాన్ని తగ్గించి గుండెకు సాధ్యమైనంత ఎక్కువ విశ్రాంతినిచ్చే భంగిమలూ ఉన్నాయి. వాటితో గుండెకు ఉపశమనం కలుగుతుంది. కాబట్టి ఇదిగో ఈ వ్యాయామం కోసం రోజు మొత్తంలో కనీసం ఐదు నిమిషాలు కేటాయించండి. ఈ వ్యాయామం ఎలా చేయాలంటే?


- గోడకు దగ్గరగా మ్యాట్ వేసుకుని వెల్లకిలా పడుకోవాలి.
- ఇలా పడుకున్నప్పుడు మోకాళ్లను మడిచి, పైకి లేపి, పిరుదులు గోడకు తగిలేలా దగ్గరగా జరగాలి.
- చేతులను వెనక్కి వాల్చేసి, కాళ్లను నెమ్మదిగా నిటారుగా పైకి లేపాలి.
- పైకి లేపిన కాళ్లను గోడకు ఆనించి, బరువును గోడ మీదే వేయాలి.
- ఈ భంగిమలో ఉన్నప్పుడు మనసు ప్రశాంతంగా ఉంచుకుని, ఊపిరి పీల్చుకోవాలి.
- ఆ సమయంలో గుండె వేగం తగ్గడం స్పష్టంగా తెలుస్తుంది.
- ఇలా 5 నిమిషాలపాటు ఉండి నెమ్మదిగా కాళ్లను కిందకి దించి, చేతులు నేల మీద ఉంచి, లేచి నిలబడాలి.

ఆయుర్వేదం

అశ్వగంధతో ఆరోగ్యం

అశ్వగంధ వేరు చూర్ణంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దక్కుతాయి. అవేంటంటే...

- **ఒత్తిడి, ఆందోళన దూరం:** ఈ చూర్ణం పాలతో కలిపి తీసుకుంటే ఒత్తిడి తగ్గి చక్కటి నిద్ర పడుతుంది. అంతేకాదు. ఒత్తిడి, ఆందోళనల ప్రభావం మూలంగా తలెత్తే ఆరోగ్య ఇబ్బందులను అధిగమించే శక్తిని సమకూరుస్తుంది.
- **బరువు తగ్గిస్తుంది:** ఇతర బరువు తగ్గించే మందులతో కలిపి ఈ చూర్ణాన్ని వాడితే ప్రభావం ఎక్కువగా ఉంటుంది. స్ట్రెస్ మూలంగా హెచ్చుతగ్గులకు గురయ్యే మెటబాలిజంను సరిచేసే శక్తి ఈ చూర్ణానికి ఉంటుంది. కాబట్టి బరువు తగ్గే వేగం పెరుగుతుంది.



- **మధుమేహం అదుపు:** నోటి మాత్రలకంటే ప్రభావవంతంగా ఈ చూర్ణం రక్తంలోని గ్లూకోజ్ లెవెల్స్‌ను తగిస్తుంది. రక్తంలోని గ్లూకోజ్ లెవెల్స్‌ను సమం చేసి ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది.
- **కేన్సర్ నుంచి రక్షణ:** పెద్దపేగు, రొమ్ములు, ఊపిరితిత్తుల కేన్సర్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది.
- **బొల్లి:** అశ్వగంధ చూర్ణానికి బొల్లి మచ్చలు చక్కగా స్పందిస్తాయి. కెరటోసిస్ అనే చర్మ చికిత్సకు అశ్వగంధ చూర్ణంతో తయారుచేసిన పేస్ట్ వాడతారు. అశ్వగంధ అద్భుతమైన స్కిన్ టోనర్‌గా కూడా పని చేస్తుంది.

వెజైనల్ హెల్త్‌ను పరిరక్షించుకోవడమనేది మహిళల పూర్తి ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. వెజైనా సమస్యలు మహిళలను మానసికంగా శారీరకంగా కుంగదీయడమే కాకుండా, వైవాహిక జీవితంలో ఒత్తిడి, ఆందోళనలకూ లోను చేస్తాయి. కాబట్టి వెజైనల్ హెల్త్ గురించి ప్రతి మహిళా అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం.

ఆ ఇబ్బందులు తొలగాలంటే...

విమెన్స్ హెల్త్

వెజైనాకు సంబంధించి స్వల్ప సమస్యలు మొదలు తీవ్రమైన సమస్యల వరకూ ఉంటాయి.

వెజినైటిస్

వెజైనా ఇన్‌ఫ్లమేషన్‌కు గురి కావడమే వెజినైటిస్. సాధారణంగా వెజైనాలో బ్యాక్టీరియా, ఈస్ట్‌ల మధ్య ఆరోగ్యకరమైన సంతులనం ఉంటుంది. ఈ సహజసిద్ధ సంతులనం దెబ్బతిన్నప్పుడు, మహిళలు అసౌకర్యాన్ని ఎదుర్కొంటారు. అలాగే అసాధారణమైన వాసన కూడా మొదలవుతుంది. ఈస్ట్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా వెజినైటిస్ రావచ్చు. లేదా కొత్త రకాల సబ్బులు, పలు రకాల ఫ్యాబ్రిక్స్‌తో తయారైన లోదుస్తుల వాడకం వల్ల కూడా ఈ సమస్య తలెత్తవచ్చు. నెలసరి తర్వాత కొందర్లో అట్రోపిక్ వెజినైటిస్ వస్తూ ఉంటుంది. ఈ సమస్యలో వెజైనా పొడిబారడం, ఇన్‌ఫ్లమేషన్‌లు ఉంటాయి.

బ్యాక్టీరియల్ వెజినోసిస్

వెజైనాలో బ్యాక్టీరియా గ్రోత్ పెరిగిపోయినప్పుడు ఈ సమస్య తలెత్తుతుంది. దురద, అసౌకర్యం, దుర్వాసన ఈ సమస్య ప్రధాన లక్షణాలు. ఈ సమస్య లైంగిక వ్యాధులు, హెచ్ఐవి సోకే ముప్పును కూడా పెంచుతుంది.

ట్రైకోమోనియాసిస్

ఇదొక లైంగిక వ్యాధి. పరాన్నజీవుల ద్వారా సంక్రమిస్తుంది. వెజైనా ఎర్రబారడం, దురద, మూత్రవిసర్జన సమయంలో అసౌకర్యం, యోని నుంచి స్రావం, దుర్వాసనలు ఉంటాయి.

వల్వోడైనియా

యోని ప్రవేశద్వారం దగ్గర నొప్పి ఈ సమస్య ప్రధాన లక్షణం. మంట, గుచ్చినట్టు అనిపించడం, కందిపోవడం, వాపు లాంటి లక్షణాలు కూడా ఉంటాయి. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే, లైంగిక కలయిక ఇబ్బందిగా మారి అనవసరపు సమస్యలకు దారి తీస్తుంది.

ఎస్‌టిఐ

లైంగిక వ్యాధులన్నీ యోని ఆరోగ్యాన్ని దెబ్బ తీసేవే! క్లమీడియా, గొనోరియా, జెనైటల్ హెర్పిస్ ప్రధాన లైంగిక వ్యాధులు. జెనైటల్ హెర్పిస్‌లో యోని నుంచి స్రావం, రక్తస్రావం, నొప్పి ఉంటాయి.

పొడిబారడం

యోని పొడిబారడానికి పలు కారణాలుంటాయి. ఈస్ట్రోజన్ హార్మోన్ లోపం, ఒత్తిడి ప్రధాన కారణాలు. అయితే శారీరకంగా కలిసే సమయంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఇబ్బంది పెడుతూ ఉంటుంది.

యోని ఆరోగ్యం కోసం...

- యోని ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. నీళ్లు, ఘాటైన వాసనలు వెదజల్లని సబ్బును ఉపయోగించి శుభ్రం చేసుకోవాలి.
- శరీరానికి సౌకర్యంగా ఉండే లోదుస్తులు, శానిటరీ న్యాప్కిన్స్ ఎంచుకోవాలి. ధరించే ప్యాంటీ తడిని పీల్చేదై ఉండాలి. రాత్రివేళ ప్యాంటీ ధరించకపోవడమే మేలు. నెలసరి సమయంలో సెంటెడ్ ట్యాంపూన్లు, ప్యాడ్స్, లైనర్స్ వాడకూడదు.
- బిగుతైన దుస్తులు ధరించకూడదు. బిగుతుగా ఉండే జీన్స్, షేప్‌వేర్‌లను ఎక్కువ సమయం పాటు ధరించడం వల్ల వెజైనల్ ఇన్‌ఫెక్షన్స్ పెరుగుతాయి.
- తడిచిన స్విమ్‌వేర్, అండర్‌ప్యాంట్స్ ఎక్కువ సమయం పాటు ధరించి ఉండిపోకూడదు. ఇలా చేస్తే ఈస్ట్ ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు పెరుగుతాయి.
- వాష్‌రూమ్‌ను ఉపయోగించిన ప్రతిసారీ వెజైనల్ ఏరియాను పొడిగా తుడుచుకోవాలి. వాష్‌రూమ్ ఉపయోగించిన తర్వాత యోని, మూత్రనాళం, పురీష నాళాల్లో సూక్ష్మజీవులు, ఈస్ట్ పెరిగిపోకుండా ఉండాలంటే యోనిని ముందు నుంచి వెనకకు శుభ్రం చేసుకోవాలి.

చికిత్సలు ఉన్నాయి



తక్కువ పొటెన్సీని కలిగి ఉండే పైపూత స్టిరాయిడ్లు, నోటి ద్వారా వాడుకునే యాంటీబయాటిక్స్, యాంటీ ఫంగల్స్, యాంటీబ్యాక్టీరియల్ లోషన్లు ఉంటాయి. యోని సమస్యలకు సాధారణంగా వైద్యులు క్లోట్రిమజోల్, బ్యూటోకోనజోల్ మందులనే సూచిస్తూ ఉంటారు. క్లిండామైసిన్ లేదా మెట్రోనిడజోల్‌లను బ్యాక్టీరియల్ వెజినైటిస్‌కూ సూచిస్తూ ఉంటారు. అయితే సమస్యను కచ్చితంగా కనిపెట్టి, ప్రభావవంతమైన మందులను వైద్యులే సూచించగలుగుతారు కాబట్టి యోనిలో ఎటువంటి సమస్య తలెత్తినా ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.


బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

మూడు ముక్కల ఆటతో ఏపీ నాశనం

● 1511వ రోజుకు అమరావతి రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 5: అమరావతిని నిర్వీర్యం చేసినందుకు అన్నదాత ఉసురు తగలక మానదని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల సందర్భంగానైనా అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1511వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ రాష్ట్రానికి సంపదనిచ్చే రాజధాని అమరావతిని విస్మరించి మూడు రాజధానులంటూ సీఎం జగన్‌రెడ్డి భ్రష్టు పట్టించారన్నారు. పక్క రాష్ట్రాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే వైసీపీ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ మాత్రం అట్టడుగుకు వెళ్ళిందన్నారు. ఇటువంటి గడ్డు పరిస్థితిలో విజన్ ఉన్న చంద్రబాబు నాయుడు సీఎం కావాలన్నారు. లేదంటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పూర్తిగా వెనకబడిపోతుందన్నారు. మూడు ముక్కల ఆటతో ఏపీని నాశనం చేయవద్దన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

సీఎం వెళ్తున్నప్పుడు జై అమరావతి నినాదాలు..

సీఎం జగన్‌రెడ్డి వెలగపూడి అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్నప్పుడు బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ మందడం రైతు ధర్నా శిబిరంలో రైతులు, రైతు కూలీలు, మహిళలు నినాదాలు చేశారు. పోలీసులు ధర్నా శిబిరం ముందు భారీ సంఖ్యలో మోహరించారు.


బిల్డ్ అమరావతి అంటూ సీఎం వచ్చే సమయంలో మందడంలో నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

అందరం కలిసి అభివృద్ధికి కృషి చేద్దాం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు
● మక్కెనను మర్యాదపూర్వకంగా కలిసిన జీవీ
● శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానం

వినుకొండ, ఫిబ్రవరి 5: వినుకొండలో అరాచక పాలన సాగిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సాగనంపి అందరం కలిసి వినుకొండ అభివృద్ధికి పాటుపడదామని మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. వైసీపీకి రాజీనామా ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావును సోమవారం ఆయన కార్యాలయంలో జీవీ ఆంజనేయులు కలిసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ మక్కెన మల్లికార్జునరావు ఎమ్మెల్యేగా మంచి అనుభవం ఉందని, కాంగ్రెస్, వైసీపీల్లో పనిచేశారని, ఆయన అనుభవం వినుకొండ అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ, జనసేన పార్టీలు కలిసి ముందుకు వెళ్తున్నాయని, రాష్ట్రం ఈ ఐదేళ్లల్లో 30 ఏళ్ల వెనక్కి వెళ్లిందని, మళ్లీ రాష్ట్ర, యువత భవిష్యత్ బాగుపడాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాలని అన్నారు. మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలు పాలక పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వారి గౌరవాలకు ఇబ్బంది కలగకుండా ప్రజాసమస్యలపై పోరాడుతున్న సమయంలో ప్రతిపక్షాలు వారిని గౌరవించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వినుకొండలో అలాంటి పరిస్థితులు లేవని, ప్రతిపక్షపార్టీ ప్రజాసమస్యలపై పోరాడుతున్న సమయంలో రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తున్నారని బొల్లాను ఉద్దేశించి అన్నారు. దీనికి సాక్ష్యం గతంలో బస్టాండ్ వద్ద జరిగిన ఘటనే అని అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులను ఇనుపరాడడ్లతో తలలు పగలగొట్టడం, పోలీసుల కాల్పుల వరకు వెళ్లడం, దాన్ని సమర్థిస్తూ దాడి చేసినవారిని కాపాడుకుంటూ పోవడం దాడులను ప్రోత్సహించడం కాదా అని ప్రశ్నించారు. ఇలాంటి నాయకులకు అండగా ఉండలేకే వైసీపీని వీడానని తెలిపారు. తనకు జనసేన, కాంగ్రెస్ పార్టీల నుంచి కూడా ఆహ్వానాలు వచ్చాయని, అయితే వినుకొండ అభివృద్ధికి తోడ్పడే వారితో కలిసి వెళ్తానని మక్కెన అన్నారు. వినుకొండ నియోజకవర్గానికి అభివృద్ధి చేసినవారిలో నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు కూడా ఉన్నారని, ఆయనను, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని, వినుకొండలో ఉన్న తన అనుచరులతో మాట్లాడి సానుకూలమైన ప్రకటన చేస్తానని తనకు కొంత సమయం కావాలని మక్కెన.. జీవీని కోరారు. అనంతరం జీవీ స్పందిస్తూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు ఎన్నో మంచిపనులు వినుకొండకు చేశారని, మక్కెన మల్లికార్జునరావుకు టీడీపీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. మక్కెనను కలిసిన వారిలో లగడపాటి వెంకట్రావు, నక్కా వీరారెడ్డి, అమృతపూడి కోటయ్య, పి.వి.సురేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


మక్కెనతో సంభాషిస్తున్న జీవీ ఆంజనేయులు

రాజధానిలో నారా భువనేశ్వరి ఓదార్పు పర్యటన

తుళ్లూరు, ఫిబ్రవరి 5: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడి సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 8వ తేదీన గురువారం రాజధాని అమరావతి ప్రాంతంలో ఓదార్పు యాత్ర చేయనున్నట్టు టీడీపీ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆమె ఓదార్చేందుకు వస్తున్నట్టు తెలిపారు. ఉదయం పది టంగలకు ఉండవల్లి నివాసం నుంచి భువనేశ్వరి బయలు దేరతారు. మధ్యాహ్నం 12 గంటలకు ఫిరంగిపురం మండలం రేగులగడ్డ(కండ్రిక)గ్రామం. మధ్యాహ్నం ఒంటి గంటకు తాడికొండ మండలం బండారు పల్లి గ్రామం, 3 గంటలకు తుళ్లూరు, 3.30 గంటలకు రాయపూడి. సాయత్రం 4 గంటలకు వెంకటపాలెంలో పర్యటిస్తారు. అనంతరం వెంకటపాలెంలోనే మహిళా పాడి రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని టీడీపీ వర్గాలు పేర్కొన్నాయి.

నేడు నియోజకవర్గంలో నిజం గెలవాలి పర్యటన..

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 5: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు సమయంలో మనస్తాపంతో మృతిచెందిన కుటుంబాలను పరామర్శించేందుకు నారా భువనేశ్వరి రాష్ట్ర వ్యాపితంగా చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమం మంగళవారం మంగళగిరి నియోజకవర్గంలో జరుగనుందని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు దుగ్గిరాల గ్రామంలో కన్నెగంటి నాగేశ్వరరావు కుటుంబసభ్యులను, 12:45 గంటలకు శృంగారపురం గ్రామంలో శృంగారపాటి శౌరీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని చెప్పారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు చినకాకానిలో అనుమోలు బసవరాజు కుటుంబ సభ్యులను, 2:40 గంటలకు తాడేపల్లి పట్టణం బ్రహ్మానందపురంలో దారా వెంకటయ్య కుటుంబ సభ్యులను, 3:05 గంటలకు నవులూరు గ్రామంలో వేమూరి కోటయ్య కుటుంబ సభ్యులను, 3:30 గంటలకు ఎర్రబాలెం గ్రామంలో జొన్నాదుల కోటేశ్వరరావు కుటుంబాన్ని, 4 గంటలకు కృష్ణాయపాలెంలో ఈపూరి దేవశ్యామ్ కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శిస్తారని తెలియజేశారు.

బీజేపీ నేతల కనుసన్నల్లో అయోధ్య రైలు

● 7వ తేదీన గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి కూత
● గంపగుత్తగా నగదుని ఐఆర్‌సీటీసీకి డిపాజిట్

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అయోధ్యధాంకి(రౌండ్ ది ట్రిప్) రైలు మొత్తం బీజేపీ నేతల కనుసన్నల్లో ప్రయాణించనుంది. ఈ రైలుని ప్రత్యేక రైలుగా కాకుండా ఐఆర్‌సీటీసీ రైలుగా నడపనుండటమే ఇందుకు కారణం. గత నెల 31వ తేదీనే గుంటూరు నుంచి బయలుదేరాల్సిన అయోధ్యధాం రైలు వాయిదా పడగా ప్రస్తుతం ఈ నెల 7వ తేదీని ఖరారు చేశారు. బుధవారం మధ్యాహ్నం గుంటూరు రైల్వేస్టేషన్‌లో బీజేపీ నేతలు సత్యకుమార్, ఇతర నాయకులు జెండా ఊపి ఈ రైలుని ప్రారంభించనున్నారు. టిక్కెట్‌లు, క్యాటరింగ్ ఛార్జీలు కలిపి మొత్తం నగదుని గంపగుత్తగా బీజేపీ నేతలే ఐఆర్‌సీటీసీకి చెల్లించారు. తొలుత వారి నాయకులు, కార్యకర్తలకే ఈ రైలులో ప్రయాణించే అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఆశించినంతంగా బీజేపీ కార్యకర్తల నుంచి స్పందన రాకపోవడంతో సామాన్య ప్రజలకు ఓపెన్ చేశారు. దాంతో దాదాపుగా 1,350 టిక్కెట్ల వరకు బుకింగ్ అయిపోయాయి. టిక్కెట్, ఐదు రోజులకు క్యాటరింగ్ ఛార్జీలు కలిపి కేవలం రూ.2,300 మాత్రమే చెల్లించినట్లు యాత్రికులు తెలిపారు.

చలో అసెంబ్లీకి అనుమతి లేదంటూ టీడీపీ నేతల అరెస్టు

వేమూరు, కొల్లూరు, ఫిబ్రవరి 5: ఎలాంటి కారణం లేకుండా వేమూరు పోలీసులు ఆదివారం అర్ధరాత్రి 12గంటల సమయంలో మండలంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ఐదుగురు నాయకులను అక్రమంగా అరెస్టు చేశారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి సుధాకర్, పోలు ప్రసాద్, తెలుగు యువత నాయకులు కోగంటి రాజేష్, గోపినాథ్‌లకు ఫోన్లు చేసి స్టేషన్‌కు పిలిపించారు. చలో అసెంబ్లీకి అనుమతి లేదంటూ వారి నుంచి పోలీసులు ఎలాంటి సంతకాలు తీసుకోకుండా కేవలం ఫొటోలు తీసుకుని తరువాత వారిని విడుదల చేశారు.

అదేవిధంగా ఆదివారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు కొల్లూరు మండలంలో పలువురి ఇళ్ళకు వచ్చి అసెంబ్లీ ముట్టడికి వెళ్ళకూడదంటూ నోటీసులు జారీ చేశారన్నారు. అసెంబ్లీ ముట్టడి ఏమిటని ప్రశ్నించగా ఉదయాన్నే స్టేషన్‌కు హాజరు కావాలంటూ చెప్పి వెళ్ళారు. మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఇంటికి తెల్లవారు జామున వెళ్ళి నోటీసులు అందించడంతో పాటు హౌస్‌అరెస్టులో ఉండాలంటూ చెప్పారు. అసలు అసెంబ్లీ ముట్టడి తమ పార్టీ నాయకులు ఎవ్వరూ పిలుపు ఇవ్వలేదని పోలీసులే అత్యుత్సాహంతో అర్ధరాత్రి నిద్రలేపి మరీ నోటీసులు ఇవ్వడంతో పాటుగా స్టేషన్‌కు రావాలంటూ తమను ఇబ్బందులకు గురి చేశారని పార్టీ నాయకులు వాపోతున్నారు.


వేమూరు పోలీస్ స్టేషన్‌లో అరెస్టైన టీడీపీ నాయకులు


కొల్లూరులో పోలీసుల నిర్బంధంలో ఉన్న టీడీపీ నాయకులు

విదర్భపై 5 వికెట్లతో ఉత్తరప్రదేశ్ గెలుపు


శోభాదేవి (88 పరుగులు)


రూపాలి సహారే (58 పరుగులు)

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 5: బీసీసీఐ అండర్-23 మహిళల వన్డే టోర్నీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో విదర్భపై ఉత్తరప్రదేశ్ జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత టాస్ గెలిచిన బ్యాటింగ్ ఎంచుకున్న విదర్భ జట్టు 48 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటయింది. రూపాలి సహారే 58, ఆయుషి ఠాక్రే 39 పరుగులు చేయగా, ఉత్తరప్రదేశ్ బౌలర్లు ఫలక్ నాజ్, అర్చనాదేవి మూడేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరప్రదేశ్ జట్టు 48.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఉత్తరప్రదేశ్ బ్యాటర్లు శోభాదేవి 88 పరుగులు, వర్షిక 45 పరుగులు, శిప్రాగిరి 42 పరుగులు చేయగా, విదర్భ బౌలర్లు అయుషి ఠాక్రే, తృప్తి లోధే రెండేసి వికెట్లు పడగొట్టారు. ఈ టోర్నీలో భాగంగా తదుపరి మ్యాచ్ ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య ఈ నెల 7వ తేదీన మంగళగిరి ఏసీఏ మైదానంలో జరుగనుంది.

రైతుల ప్లాట్లలో మట్టి మాయం

తుళ్లూరు, ఫిబ్రవరి 5: రాజధాని ప్రాంతంలో రైతుల ప్లాట్లలో అక్రమార్కులు మట్టి మాయం చేస్తున్నారు. వెంకటపాలెం నుంచి కృష్ణాయపాలెం వెళ్లే మార్గంలో ఓ రైతు ప్లాట్లలో మట్టిని రాత్రి వేళ తరలిస్తున్నారు. గతంలో ఇదే ప్లాటులో మట్టిని కాజేస్తుంటే జేసీబీ, లారీని రైతులు పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. అప్పట్లో ఇద్దరిపై కేసు నమోదైంది. గత రెండు రోజుల నుంచి అదే ప్రాంతంలో మరలా మట్టిని తీసుకెళుతుండటంతో సోమవారం ఆ రైతు పోలీసులను ఆశ్రయించినట్టు సమాచారం. రాజధాని ప్రాంతంలో వేసిన రోడ్లను తవ్వి కంకరు మాయం చేసిన ఘటనలు కూడా గతంలో జరిగాయి. అలాగే ఐరన్, మట్టి, ఇసుక వంటి వాటిని కూడా గతంలో అక్రమార్కులు మాయం చేశారు.

తెనాలి రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తిమృతదేహం

తెనాలి క్రైం, ఫిబ్రవరి 5: తెనాలి రైల్వేస్టేషన్‌లో అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు. స్టేషన్‌లోని 4వ నెంబరు ప్లాట్‌ఫారంపై ఓ వ్యక్తి మృతి చెందాడన్న సమాచారంతో వెళ్ళి పరిశీలించగా 55-60 సంవత్సరాల గల వ్యక్తి అనారోగ్యంతో మృతిచెంది ఉండగా గుర్తించామన్నారు. మృతుని వద్ద ఎలాంటి సమాచారం లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రైలు ఢీ కొని వ్యక్తి..

తెనాలి క్రైం, ఫిబ్రవరి 5: తెనాలి-విజయవాడ ప్రధాన రైలుమార్గంలో పెదవడ్లపూడి రైల్వే స్టేషన్ వద్ద గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరరావు (77) ఆదివారం మధ్యాహ్నం టీ తాగడం కోసం రైల్వేస్టేషన్ పక్కన టీ దుకాణం వద్దకు బయలుదేరాడు.ఈ క్రమంలో రైల్వేట్రాక్ దాటుతుండగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో మృతుని కొంత భాగం పెదవడ్లపూడి రైల్వే ట్రాక్ పక్కన పడిపోగా, మరి కొంత భాగం దుగ్గిరాల రైల్వే స్టేషన్ పరిధిలో పడిపోయింది. దీనిపై తెనాలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

మృతదేహంతో బంధువుల నిరసన

చేబ్రోలు, ఫిబ్రవరి5: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చల్లపల్లి విజయ్ మృతదేహంతో సోమవారం బంధువులు చేబ్రోలు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగ్గారు. చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన విజయ్ గుంటూరులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ద్విచక్రవాహనంపై బయల్దేరిన విజయ్ చేబ్రోలు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదులో తమకు అన్యాయం జరిగిందంటూ మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను మార్చారని ఆరోపిస్తున్నారు. రెండు గంటల పాటు ఈ నిరసన ధర్నా కొనసాగటంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకొని నిరసన కారులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు.


చేబ్రోలు పోలీస్ స్టేషన్ వద్ద మృతదేహంతో ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

పునరావాస కేంద్రాల్లో ఉచితంగానే రిజిస్ట్రేషన్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5: పులిచింతల ప్రాజెక్టు పరిధిలోని పునరావాస కేంద్రాల్లో స్థలాలు, ఇల్లు రిజిస్ట్రేషన్ పేరుకే ఉచితం.. మామూళ్ల ఇష్టారాజ్యం అంటూ సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో పాటు పులిచింతల ప్రాజెక్టు అధికారులు కూడా స్పందించారు. పులిచింతల పునరావాస కేంద్రాల్లో స్థలాలు, ఇల్లు రిజిస్ట్రేషన్‌కు ఫీజు, యూజర్ చార్జి లేకుండానే రిజిస్ట్రేషన్ జరపాల్సి వుందని, ఇందుకోసం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఒక్క రూపాయి కూడా నగదు ఇవ్వాల్సిన అవసరం లేదని పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కందుల శ్రీరాములు, సబ్‌రిజిస్ట్రార్ తీర్థరాజ్యలక్ష్మి తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్‌ల కొరకు నేరుగా కార్యాలయ అధికారులనే సంప్రదించవచ్చునని, బయటి వ్యక్తులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దన్నారు.

8న పిడుగురాళ్లలో జంగా ఆత్మీయ సమావేశం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి రాజకీయ కార్యాచరణ కొరకు ఈ నెల 8వ తేదీన పిడుగురాళ్లలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు బడుగు బలహీనవర్గాల ఐక్యవేదిక కార్యదర్శి షరీఫ్ తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జంగా అనుచరులు, బలహీనవర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల నేతలతో సమావేశమై రాజకీయంగా ఓ నిర్ణయానికి వచ్చేలా జంగా సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకోనుంది.

టెక్స్‌టైల్ టెక్నాలజీ విద్యార్థులకు ఉపకార వేతనాలు


సామినేని కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 15 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సామినేని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాక అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హత కల్గిన విద్యార్థులు ఫిబ్రవరి 12వ తేదీలోపు తమ వివరాలను ఐఎస్‌ఎఫ్‌వో ఎట్‌దిరేట్ ఎస్‌ఎఎల్‌వైఏఎం. కామ్ లేదా హెచ్‌ఆర్ ఎట్‌దిరేట్ ఎస్‌ఏఎల్‌వైఏఎం.కామ్ అనే మెయిల్ ఐడిలకు పంపాలని కోరారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 15వ తేదీన పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు సమీపంలోని బోయపాలెం అనంతలక్ష్మీ స్పిన్నింగ్ మిల్ ఆవరణలో ఒక్కొక్కరికి రూ. 15 వేలు అందజేయనున్నట్టు వివరించారు.

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య


చీమల అంకిరెడ్డి(ఫైల్)

రొంపిచర్ల, ఫిబ్రవరి 5 : పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చీమల అంకిరెడ్డి(75) నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. వరి, మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. తెగుళ్ల, అకాల వర్షంతో దిగుబడులు సరిగ్గా రాలేదు. దాంతో సుమారు ఐదు లక్షల మేర అప్పులు అయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో పొలంలోనే బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు పేర్కొన్నారు. భార్య, ముగ్గురు సంతానం కాగా కుమారులకు, కుమార్తెలకు వివాహాలు జరిగాయి. కుమారుడు వెంకటేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పాల్ రాజు రవీంద్ర తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏసీబీ వలలో సొసైటీ సెక్రటరీ


ఏసీబీకి పట్టుబడిన ప్రభాకరరావు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి4: మండలంలోని ముట్లూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయంపై సోమవారం ఏసీబీ అధికారుల దాడి చేశారు. రుణం మంజూరు కోసం సొసైటీ సెక్రటరీ ప్రభాకరరావు లంచం తీసుకుంటుండగా పట్టుకొన్నారు. వివరాల్లోకి వెళితే... ముట్లూరు గ్రామానికి చెందిన గ్రామ ఉపసర్పంచ్ ఎనుముల బాలస్వామి తల్లి పొలం తాకట్టుపెట్టి రుణం పొందేందుకు సొసైటీలో దరఖాస్తు చేసుకొంది. దరఖాస్తును పరిశీలించి రూ.16లక్షల రుణం మంజూరు చేస్తామని అందుకు ఖర్చుల కింద రూ.40వేలు ఇవ్వాలని అడిగారని బాలస్వామి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు.

మా ఆందోళనకు మద్దతు ఇవ్వండి

● పీసీసీకి వరికపూడిశెల ప్రాజెక్టు రైతుల వినతి

విజయవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వరికపూడిశెల ప్రాజెక్టు సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే ఆందోళనకు మద్దతు ఇవ్వాలని సమితి ప్రతినిధులు పీసీసీ నేతలను కోరారు. వారు విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీకి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ ప్రాజెక్టు పనులను సీఎం జగన్ గడచిన ఏడాది నవంబరు 15న మాచర్లలో వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. ఇప్పటి వరకు రూపాయి నిధులు విడుదల చేయలేదన్నారు. ఈ ప్రాజెక్టు సాధన కోసం జరిగే ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

పీఎఫ్ వడ్డీ నష్టపోతున్న ఉద్యోగులు

● పీఆర్‌టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.శ్యామ్ మోజెస్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి5: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పంచాయతీరాజ్, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2022 అక్టోబరు నుంచి జీతాల బిల్లుల నుంచి మినహాయించిన నగదు జడ్పీ పీఎఫ్ ఖాతాల్లో జమకాలేదని పీఆర్‌టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.శ్యామ్ మోజెస్ సోమవారం తెలిపారు. 14 నెలల నుంచి ఏకమొత్తంగా జమ అయిన సొమ్ము నెల వారి జమచేయకుండా మొత్తం డిసెంబరు 2023లో జమ అయినట్లు చూపెడుతుందన్నారు. సొమ్ము జమ అయిన తేదీని వడ్డీకి పరిగణనగా తీసుకోవటం దారుణం అన్నారు. ఇలా అయితే వేలాది రూపాయల వడ్డీ నష్టపోతున్నారని తెలిపారు. నష్ట నివారణకు తగిన చర్యలు వెంటనే చేట్టాలని డిమాండ్ చేశారు. నరసరావుపేట మున్సిపాలిటీలో 5 గ్రామాలు విలీనం జరగటం వలన కోటప్పకొండ, జీముప్పాళ్ళ, గోనెపూడి, పమిడిపాడు, పరగటిచర్ల గ్రామాల ఉద్యోగులకు 10 శాతం నుంచి 16శాతం పెంపుదలతో నరసరావుపేట పట్టణానికి వర్తించే హెచ్ఆర్ఏ చెల్లిస్తారని పీఆర్‌టీయు ప్రధాన కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరావు అన్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 98,671 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 88,652 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 80,882 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	17000	17000
334	8000	19000	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు. 5	13300	18000	తేజ	9000	21000
273	12500	16500	బ్యాడిగి	10500	18500
341	11500	19000	దేవనూరుడీలక్స్	10500	20500
4884	--	--	తెల్లకాయలు	5000	12000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.43 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	124, 133,144
చికెన్ విత్ స్కిన్	234.00
చికెన్ స్కిన్ లెస్	244.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

అమరావతి తహసీల్దార్‌గా వెంకట రమణారావు



వెంకట రమణారావు

అమరావతి, ఫిబ్రవరి 5: అమరావతి తహసీల్దార్‌గా ఏ వెంకట రమణారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన జె. విజయశ్రీ నెల్లూరు జిల్లా కోవూరు మండలానికి బదిలీ కావడంతో నెల్లూరు జిల్లా కావలి డివిజన్ జలదంకి తహసీల్దార్‌గా పనిచేస్తున్న వెంకట రమణారావు అమరావతి తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్‌కు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు.

పెదకూరపాడు.. ప్రభాకరరావు

పెదకూరపాడు, ఫిబ్రవరి 5: పెదకూరపాడు తహసీల్దార్‌గా జే ప్రభాకర రావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయనను డిప్యూటీ తహసీ ల్దార్ నిర్మల కృష్ణ, వీఆర్‌వోలు బొకేలు అందించి శాలువాతో సత్కరించి స్వాగ తం పలికారు. పెదకూరపాడు తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి న మహమ్మద్ జియావుల్ హక్ బదిలీపై ప్రకాశం జిల్లా వెళ్లారు.

రెంటచింతల.. రామ్మోహనరావు

రెంటచింతల, ఫిబ్రవరి 5: మండల తహసీల్దార్‌గా ఎస్ రామ్మోహనరావును నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ యన నెల్లూరు జిల్లా దుత్తలూరు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఇప్ప టిదాకా ఇక్కడ పనిచేసిన కె.పుల్లారావును తిరుపతికి బదిలీ చేశారు.

దుర్గి.. రజనికుమారి



రజనికుమారి

దుర్గి, ఫిబ్రవరి 5: దుర్గి తహసీల్దార్‌గా రజనికుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా మద్ది పాడు నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన రమేష్‌కుమార్ మార్కాపురానికి బదిలీపై వెళ్లారు.

సత్తెనపల్లి .. ఉష



సీహెచ్ ఉష

సత్తెనపల్లి, ఫిబ్రవరి 5: సత్తెనపల్లి తహసీల్దార్‌గా సీహెచ్ ఉష సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా సింగరాయకొండ నుంచి సత్తెనపల్లికి వచ్చారు.

మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న వడియరాజుల ఉద్యోగుల సంఘం

మాచర్ల, ఫిబ్రవరి 5: వడియరాజుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్లా పిచ్చయ్య ఆధ్వర్యాన సోమవారం పట్టణంలోని పురపాలక సంఘంలో మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్‌ను సన్మానించారు. వెంకటదాస్ నూతనంగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడంతో ఈ సన్మాన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో కొమెర అనంతరాములు, శివప్రసాద్, అమర్నాథ్, బోసు, కొండలు, శివ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన జగనన్న ధ్యేయం : పీఆర్కే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీఆర్కే

దుర్గి, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నాలుగో విడత వైఎస్సార్ ఆసరా ప్రారంభించి మాట్లాడారు. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలను ప్రవేశపెట్టి ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రజాసంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటికి చేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు. వైఎస్సార్ ఆసరా కింద మండలపరిధిలో 813 స్వయం సహాయక సంఘాల్లోని 8130 మందికి రూ. 6.72 కోట్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు, మార్కెట్‌యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, జడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, ఎంపీపీ యేచూరి సునీత శంకర్, ఉన్నం వెంకటేశ్వర్లు, నక్కా చిన వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పిన్నెల్లి సోదరులను కలుసుకున్న కారంపూడి ఎంపీపీ

మాచర్ల, ఫిబ్రవరి 5: కారంపూడి ఎంపీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బొమ్మిన సావిత్రి అల్లయ్య సోమవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సర్పంచ్ పంగులూరి రామకృష్ణయ్య, దొడ్డమల్లేశ్వరస్వామి ట్రస్ట్ బోర్డు చైర్మన్ అమరయ్య, శ్రీనివాసరావు, గాదెవారిపల్లె సైదా తదితరులు పాల్గొన్నారు.

స్నేహ హస్తాల ఫౌండేషన్ ల్యాప్ ట్యాప్ అందజేత

అచ్చంపేట, ఫిబ్రవరి 5: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలో గల జడపల్లి తండాకు చెందిన బాణావత్ అంజన్ కుమార్ అనే విద్యార్థికి సోమవారం స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.40వేలు విలువైన ల్యాబ్ ట్యాప్‌ను అందించారు. స్థానిక విద్యాశాఖ అధికారి రావిపాటి నరసింహారావు చేతుల మీదుగా అందజేశారు. అంజన్‌కుమార్ మెకానికల్ ఇంజనీ రింగ్ చివరి సంవత్సరం భీమవరంలోని విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థులకు సేవ చేయటం గొప్ప విషయం అని ఎంఈవో నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహ హస్తాల ఫౌండేషన్ సభ్యులు తుమ్మా శౌరిరెడ్డి, కో-ఆర్డినేటర్ తాయి కరీముల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు



ఎస్పీ రవి శంకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ గురునాథ్‌బాబు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 5: ఇటీవల జరిగిన బదిలీల్లో రాజమండ్రి నుంచి సత్తెనపల్లికి డీఎస్పీగా బదిలీ అయిన గురునాథ్ బాబు సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేయాలన్నారు. సబ్ డివిజన్‌లోని అధికారులతో విధులను సమర్థవంతంగా నిర్వహించేలా చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలన్నారు. ప్రజల రక్షణ, భద్రత కోసం కృషిచేయాలన్నారు. విజుబుల్ పోలీసింగ్‌ను పెంచేలా చూడాలని సూచించారు.

ఎస్పీని కలసిన సెబ్ సూపరింటెండెంట్

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 5: పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డిని నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్పీ ఖాజా మొహిద్దీన్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఖాజా మొహిద్దీన్ నరసరావుపేట సెబ్ రెండో సూపరింటెండెంట్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. 1996 బ్యాంచ్‌కి చెందిన కాజా మొహిద్దీన్ ఎక్సైజ్ శాఖలో సీఐగా 25సంవత్సరాల పాటు ప్రకాశం జిల్లాలో పనిచేశారు. అనంతరం ఏఈఎస్‌గా ప్రమోషన్ పొంది ఒంగోలు ఐఎస్‌ఎంఎల్ డిపోలో అసిస్టెంట్ మేనేజరుగా పనిచేశారు. అనంతరం పదోన్నతిపై పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.

టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని సామాజికవర్గాలకు లబ్ధి



భవిష్యత్తుకు గ్యారంటీ కార్డులను ప్రజలకు అందజేస్తున్న యరపతినేని

- మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
- జానపాడులో 6వ రోజు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ
- టీడీపీ, జనసేన కార్యకర్తలతో ఊరంతా సందడి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5: టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని సామాజికవర్గ నేతలకు మంచి జరుగుతుందనే భావన ఈసారి ప్రజలందరిలో కలిగిందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం జానపాడు గ్రామంలో ఆరో రోజు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగింది. గతంలో జరిగిన కార్యక్రమంలో కన్నా ఇప్పటి కార్యక్రమానికి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో హాజరుకావడంతో ఊరంతా సందడి నెలకొంది. ఈ సందర్భంగా యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలకు రక్షణ, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయడంతో పాటు తల్లికి వందనం పేరుతో ప్రతి ఇంట్లో చదువుకునే చిన్నారులందరికీ ఏడాదికి 1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 ఉచిత సిలిండర్లతో పాటు తాను మరొక సిలిండర్‌ను ఉచితంగా అందజేస్తానని యరపతినేని తెలిపారు. జానపాడు గ్రామం టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని వివరించారు. మహిళలు, పార్టీ శ్రేణులు యరపతినేనికి ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారంటీ కార్డులను అందజేసి వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గండికోట వెంకటేశ్వర్లు, చింతలపూడి రామ్మూర్తి, ముప్పాళ్ల సాంబయ్య, వడ్డవల్లి సర్వేశ్వరరావు, వున్నం సురేష్, బండ్ల వెంకటేష్, యేలూరి ఢిల్లీ, కామిశెట్టి రమేష్, బండ్ల లక్ష్మణరావు, యడ్లపల్లి నారాయణ తదితరులున్నారు.

యాదవ సామాజికవర్గానికి ప్రాధాన్యం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5: గురజాల నియోజకవర్గంలోని యాదవ సామాజికవర్గానికి రానున్న స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం ఇస్తూ పదవులు కేటాయించనున్నట్లు యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పార్టీ పట్టణ కార్యాలయంలో గురజాల నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన యాదవ సామాజికవర్గ నేతలతో యరపతినేని సమావేశం నిర్వహించారు. టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు గుర్తింపు వచ్చిందన్నారు. తాను కూడా గతంలో ఓసీ రిజర్వేషన్ ఉన్న పదవులను బీసీలకు కేటాయించానని, రానున్న ప్రజాప్రభుత్వంలో కూడా అదే కొనసాగిస్తామన్నారు. అదేవిధంగా పట్టణ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ప్రతిరోజు ఏదో ఒక వార్డులో కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు దగ్గరవుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూడాల్సి ఉందన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ఎస్సీలు సిద్ధంగా ఉన్నారు



జగన్ ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ ఎస్సీ నాయకులు

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 5: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీలకు వర్తించే పథకాలను రద్దు చేస్తూ వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు ఎస్సీలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎస్సీ నాయకులు అన్నారు. నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాలతో మండలంలోని లక్కరాజు గార్లపాడు గ్రామంలో సోమవారం దళిత చైతన్య యాత్ర నిర్వహించారు. యాత్రలో పాల్గొన్న ఎస్సీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దళితుల అభ్యున్నతికి, సంక్షేమానికి చేపట్టిన చర్యలు శూన్యం అన్నారు. దళితులు పూర్తిగా మోసపోయారని, సరైన సమయంలో సరైన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వం రద్దు చేసిన 27 ఎస్సీ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఎస్సీల వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న జగన్‌రెడ్డి తీరును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ నాగయ్య, పుట్టి సతీష్, తుమ్మల ఏడుకొండలు, పచ్చల వెంకటేశ్వర్లు, జంగా శ్రీనివాస్, రమేష్, ఎర సాని సురేష్, గుంటూరు ఆశీర్వాదం, బొజ్జా కాంతారావు, బండారు నాగరాజు, చిలకా చంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

కోడెల విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 5 : మండలంలోని భీమవరంలో ఆదివారం రాత్రి దివంగత మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన తనయుడు డాక్టర్ కోడెల శివరామ్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రిగా, శాసన సభ్యుడిగా, సభాపతిగా రాష్ట్ర, నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. నియోజకవర్గ, మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్‌పై వైసీపీ విషప్రచారం

దాచేపల్లి, ఫిబ్రవరి 5: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని, అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరాలపాటి జాని ఆరోపించారు. సోమవారం దాచేపల్లి మండల పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైందని, చచ్చిన శవంతో సమానంగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. రుద్రరాజు, రఘువీరారెడ్డి, కేవీపీ వంటి సీనియర్ నాయకులు పార్టీని అధికారం వైపు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారన్నారు. షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. వైసీపీ నేతల అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆయన అన్నారు.

దోమల నివారణకు చర్యలు



దోమల మందును పిచికారి చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని జమ్మలమడకలో సోమవారం సర్పంచ్ ముక్కా చౌడమ్మ గురవయ్య ఆధ్వర్యాన దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వీధుల్లో, సైడు కాలువల్లో దోమల మందు స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ సుజాత, హెల్త్ అసిస్టెంట్ మురళీధర్, ఏఎన్ ఎం కోటేశ్వరి, స్వరూప, మేరి, మంగమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

రెంటచింతల, ఫిబ్రవరి 5: రెంటచింతల, పాలువాయి గ్రామాల్లోని వివిధ రేషన్ షాపులను ఆర్ఐ కాంతారావు నేతృత్వంలో తనిఖీ చేశారు. ఎండీయూ వాహనాన్ని ఎక్కడో బజారులో నిలబెట్టి లబ్ధిదారులను వాహనాల వద్దకే రప్పించే ప్రయత్నం చేయవద్దన్నారు. ఆయన వెంట వీఆర్వో రేఖా ప్రియదర్శిని, రామకృష్ణ తదితరులున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

వెల్దుర్తి, ఫిబ్రవరి 5: రచ్చమలపాడు ఎంపీయూపీ స్కూల్ వద్ద షేక్ మదీనా అనే వ్యక్తి అక్రమ మద్యం కలిగి ఉండటంతో సెబ్ అధికా రులు దాడులు జరిపారు. అతడి నుంచి 20బాటిళ్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకోవడంతోపాటు మదీనాను అదుపులోకి తీసుకున్నారు.

స్పందనకు 120 ఫిర్యాదులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 5: పల్నాడు జిల్లా నరరావుపేట కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాల్లో సోమవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్‌వో కే వినాయకం, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఉమారాణి, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ పీఏ ముని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 120మంది అర్జీదారులు జిల్లావ్యాప్తంగా తరలివచ్చి ఫిర్యాదులు చేశారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 : జీవీఎంసీ ఎనిమిదో వార్డు పరిధిలోని ఎండాడలో ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... గుంటూరు జిల్లాలోని మాచర్లకి చెందిన భీమబోయిన చెన్నకేశవ (24) ఎండాడలోని దుర్గాలమ్మ గుడి ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు హాస్టల్‌లో నెల రోజుల క్రితం చేరాడు. ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు హాస్టల్ యాజమాన్యానికి చెప్పి రూమ్ తీసుకున్నాడు. సోమవారం రాత్రి హాస్టల్‌లో ఉన్న వారంతా భోజనాలు చేసినా.. చెన్నకేశవ రాకపోవడంతో వసతి గృహం సిబ్బంది రూమ్‌కి వెళ్లి తలుపులు కొట్టారు. తలుపులు ఎప్పటికీ తీయకపోవడంతో అనుమానం వచ్చి బల వంతంగా తెరిచి చూడగా ఫ్యాన్‌కి ఉరి వేసుకుని కనిపించడంతో పీఎం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సొసైటీ పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు

రెంటచింతల, ఫిబ్రవరి 5: సహకార సంఘాల అధ్యక్షుల పదవీ కాల పరిమితి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు నరసరావుపేట డిప్యూటీ రిజిస్ట్రార్ రహంతుల్లా సోమవారం ఆయా సొసైటీల కార్యదర్శులకు సమాచారం పంపారు. జూలై 31 వరకు పాలకవర్గాలు పదవిలో ఉండేవిధంగా ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. 2013 జనవరి 24న సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వాటి గడువు 2018లో ముగిసింది. అప్పటి నుంచి ఎన్నికలు జరగలేదు. మండలంలో మూడు సహకార సంఘాలున్నాయి.

టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాలని రాజ శ్యామల యాగం


నకరికల్లు, ఫిబ్రవరి 5: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన కూటమి అధికారం లోకి రావాలని కోరుతూ సత్తెనపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బొర్రా వెంకట అప్పారావు చేజర్ల కపోతేశ్వర దేవాలయ ప్రాంగణంలో సోమవారం రాజశ్యామల యాగాన్ని ప్రారంభించారు. సోమవారం ఉదయం కండ్లకుంట గ్రామం నుంచి ప్రారంభమైన బొర్రా పాదయాత్ర చేజర్లకు చేరుకుంది. కుంకల గుంటలో ఎన్‌టీ ఆర్ విగ్రహానికి పూలమాల వేసి బొర్రా నివాళులర్పించారు. ఆయనతో పాటు డాక్టర్ కోడెల శివరామ్, జనసేన పార్టీ శ్రేణులు పాదయాత్రలో, ఈ యాగంలో పాల్గొన్నారు.

బీసీల ద్రోహి సీఎం జగన్‌రెడ్డి

- మండల టీడీపీ నాయకులు

అచ్చంపేట, ఫిబ్రవరి 5: బీసీ సబ్ ప్లాన్ నిధులను నిర్వీర్యం చేసి బీసీలను అగణ దొక్కేందుకు ప్రయత్నించినా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బీసీల ద్రోహి అని మండల టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వాల్ పోస్టర్లను గోడలకు అంటించారు. అవినీతిమయమైన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ మరింత ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, క్లస్టర్ ఇన్‌చార్జ్ బత్తుల శ్రీనివాసరావు, రాష్ట్ర యువత కార్యదర్శి కూకట్లపల్లి వీరాంజనేయులు, కూకట్లపల్లి అయ్యపరాజు, గాదె వీరాంజనేయులు, తాళ్ళూరి చెంచు, మార్కపూడి పరిశుద్ధం, చిలకా చిన శాంతయ్య, సంసోన్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఫాస్టర్ ఫెలోషిప్ బృందం

దుర్గి, ఫిబ్రవరి 5: మండలంలోని పోలేపల్లిలో గల షాలోం ప్రార్థన మందిరం సంఘ కాపరి మాగులూరి చంద్రపాల్ కుమారుడు ఐజక్ పాల్ అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండలంలోని ఫాస్టర్ ఫెలోషిప్ బృందం ఆ కుటుంబాన్ని పరామర్శించి మృతుని భార్య మనీషాకు రూ.30 వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో యోహాను, అన్నారావు, మార్కు, వందనం, యేసురత్నం, ప్రదీప్‌చంద్ర, దావీదు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలు మైనింగ్ ఫండ్ విడుదల

- పీఆర్ డీఈఈ పాశం

రెంటచింతల, ఫిబ్రవరి 5: మండలంలోని మంచికల్లు గ్రామ ఎస్టీకాలనీలో ఆంజనేయస్వామి గుడికి ప్రహరీ నిర్మాణం నిమిత్తం రూ.10 లక్షలు విడుదలైనట్లు పంచాయతీరాజ్ డీఈఈ పాశం శ్రీనివాసరెడ్డి చెప్పారు. మైనింగ్‌శాఖ ద్వారా ఈ నిధులు విడుదలయ్యాయని ఈ విషయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు.

జేఎన్‌టీయూలో నూతన భవనాల ప్రారంభం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 5: వైసీపీ ప్రభుత్వం రూ.100 కోట్లతో జేఎన్‌టీయూ కళాశాలను అభివృద్ధి చేసినట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం నరసరావుపేట మండలం కాకాని వద్ద జేఎన్‌టీయూ కళాశాలలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఇంకా ఎంతో అభివృద్ధి చేయాల్సింది ఉందన్నారు. కార్యక్రమంలో కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్‌చాన్సలర్ ప్రసాదరాజు, జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, మిట్టపల్లి రమేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోతో పేదలకు ఎంతో మేలు

- సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



సూపర్-6 పథకాల కరపత్రాలను మహిళలకు అందిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 5 : తెలుగుదేశం పార్టీ ప్రవేశ పెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టోతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని దీపాలదిన్నెపాలెంలో సోమవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ - 6 పథకాలతో పేదల భవిష్యత్తే మారి పోతుందన్నారు. 40 సంవత్సరాల రాజకీయ చరిత్రలో ఇసుకను అమ్ముకున్న ముఖ్యమంత్రిని దేశంలో ఎక్కడా చూడ లేదన్నారు. ఇసుకను అమ్ముకొని పేదలకు జగన్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారన్నారు. బ్రిటీషు పాలనను తలపిస్తున్న జగన్ పాలనను అందరూ కలసి కట్టుగా చరమ గీతం పాడాలన్నారు. ముందుగా గ్రామంలోని ఇంటింటికి వెళ్ళి ప్రజలను పలుకరిస్తూ సూపర్ - 6 పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామానికి వచ్చిన కన్నాకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలుకగా అభిమానులు ఆయనపై పూల వర్షం కురిపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, నారుకొండ వీరప్రసాదు, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ సాంబయ్య, భీమినేని వందనాదేవి, ఎలినేడి రామస్వామి, పసుపులేటి శివమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలనకు తెరదించుదాం : సాయినిఖిల్

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5: ఐదేళ్ల సైకో పాలనలో రాష్ట్రం అన్నివిధాల నష్టపోయిందని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు సాయినిఖిల్ తెలిపారు. ఆది, సోమవారాల్లో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఐదేళ్ల సైకో పాలనను తెరదించుతూ వాల్‌పోస్టర్లను అంటించారు. రాజధానిలేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ తయారైందని, మరో సారి మోసపోయేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని వివరిస్తూ పోస్టర్లను అంటించారు. అనంతరం చంద్రపాలెం సీతా రామాంజనేయ స్వామి దేవాలయం వార్షిక పూజా కార్యక్రమాల్లో నిఖిల్ పాల్గొన్నారు. చంద్రపాలెం 1వ వార్డులో పక్షవాతంతో బాధపడుతున్న వేముల బసవ రాజును యరపతినేని సాయినిఖిల్ పరామర్శించారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరికలు



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5: వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమను పట్టించుకోకపోవడంతో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన కొందరు నేతలు వైసీపీ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వైసీపీని వీడి సోమవారం టీడీపీలో చేరారు. మాచవరం మండలం మోర్జం పాడు గ్రామానికి చెందిన 20 ఎస్సీ సామాజికవర్గాలకు చెందిన వారికి మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పోతుల లియరాజు, కొత్త కోటేశ్వరరావు, ప్రేమ్‌కుమార్, మరియరాజు, యాకోబు, రవి, పెద్దమార్కు, బుజ్జయ్య, జ్ఞానయ్య, పేరం కోటయ్య, తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో పాశం రాధాకృష్ణ, యలగాల నరసింహారావు, ముంగి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వారంతా పార్టీలో చేరారు. అదేవిధంగా పట్టణ పరిధిలోని 5వ వార్డులో ఉన్న సుందరయ్య కాలనీ ముస్లిం మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన 40కుటుంబాల వారు వైసీపీని వీడి సోమవారం యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్ రిజ్వాన్, పఠాన్ నాగుర్‌బాష, షేక్ ఇర్ఫాన్, సుభాని, నజీర్, హుస్సేన్, నాగుర్‌బాష, శివకాసులు, శిలార్, ముంతాజ్, జరీనా, గౌసియా, పాతిమా, సైదాబి, చిన్నసైదాబి, పెద్దసైదాబి, పకీరమ్మ, కాశిం, మెరుగు గంగాధర్, ఈశ్వరమ్మ, శివపార్వతి, నక్కా అన్నమ్మ తదితరులున్నారు. 5వ వార్డు ఇన్‌చార్జ్ కందిమళ్ల శ్రీను, పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, పిల్లి చెన్నారావు, వడ్డవల్లి సాంబశివరావు, జానీ బాషా, సిలార్, నాసరయ్య, బుడే తదితరులున్నారు.

మాజీ సర్పంచ్ చెన్నమ్మ మృతికి సంతాపం

రెంటచింతల, ఫిబ్రవరి 5: మండలంలోని జెట్టిపాలెంకు చెందిన మాజీ సర్పంచ్ నీలం చెన్నమ్మ సోమవారం రాత్రి పిడుగురాళ్లలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె వయసు 65 సంవత్సరాలు. 1995 నుంచి 2000 వరకు సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డిలు సంతాపం తెలిపారు. ఫోన్లో కుటుంబీకులను పరామర్శించారు.

ఐదేళ్లు రాజధానే లేకుండా జగన్ పాలన చేశారు

- తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు

పెదకూరపాడు, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో ఐదు సంవత్సరాల్లో రాజధాని లేకుండా ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం పాలన చేశారని తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది రైతులకు సాగు నీరు అందించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పంటలు సాగు చేసిన రైతులు లక్షలాది రూపాయల నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను విస్మరించారని, ఏ వర్గానికి న్యాయం చేయలేదని, పేదలు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

నిరుద్యోగులను నిలువునా ముంచిన ప్రభుత్వం

- టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొండవీటి దత్తాత్రేయులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 5: ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా ముంచిందని టీడీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి కొండవీటి దత్తాత్రేయులు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏటా డీఎస్సీ అంటూ నాలుగున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం నిరుద్యోగులను ఊరిస్తూ వచ్చిందన్నారు. ఎన్నికల జిమ్మిక్కుల్లో భాగంగా డీఎస్సీని ప్రకటించిందన్నారు. ఎన్నికల ముందు ఏదో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని ప్రచారం చేసుకోవటమే తప్ప ఈ డీఎస్సీతో నిరుద్యోగులకు వనగూరింది ఏమి లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35వేల పోస్టులు ఖాళీగా ఉండగా 6,100 పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రకటించారన్నారు. డీఎడ్ చదువులు పూర్తి చేసి ఉపాధ్యాయుల కొలువుల కోసం నిరీక్షిస్తున్న వారు వేల సంఖ్యలో ఉన్నారన్నారు. వచ్చే రెండు నెలల్లో చాలా మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయబోతున్నారన్నారు. ఈ ఖాళీలను లెక్కలోకి తీసుకోకుండా డీఎస్సీ నియామకం చేపట్టడం ఏంటని? ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికే ఖాళీ పోస్టులను భర్తీ చేసి ఉండేదన్నారు. నిరుద్యోగులను మోసం చేయటానికే ఈ డీఎస్సీ అన్నారు. రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

సమస్యను గుర్తించారు.. ప్రత్యామ్నాయం చూపలేదు

కారంపూడి, ఫిబ్రవరి 5: మండలంలోని పెదకొదమగుండ్ల పంచాయతీ పరిధిలో గల బ్రహ్మనాయుడు కాలనీలో నివసిస్తున్న ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులు కొంత కాలంగా జ్వరాలు, కీళ్ల నొప్పులతో అంతుబట్టని రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలయ్యారు. ఇందుకు సంబంధించి పంచాయతీ, ఆరోగ్యశాఖ తాగునీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపగా బోరునీటిలో బ్యాక్టీరియా ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. కాలనీలవాసులు బోరు నీటిని వినియోగించవద్దని అధికారులు చెప్పేశారు. అయితే ప్రత్యామ్నాయం మాత్రం చూపలేదు. దీంతో కాలనీలవాసులు సుదూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యామ్నాయం చూపాలని కోరుతున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఏఎస్పీ రాఘవేంద్ర

స్పందన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

● ఏఎస్పీ రాఘవేంద్ర

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 5: జగనన్నకు చెబుదాం స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని పల్నాడు జిల్లా పరిపాలన అదనపు ఎస్పీ ఆర్.రాఘవేంద్ర సోమవారం తెలిపారు. ప్రతి సోమవారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన ఫిర్యాదిదారుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తులకు సంబంధించి సమస్యలు ఎక్కువగా అందాయి. చిలకలూరిపేట పట్టణానికి చెందిన పల్లపు ఏడుకొండలు అనే వ్యక్తి తన కుమారుడికి విమానాశ్రయంలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.3 లక్షలు డబ్బులు తీసుకున్న తరువాత ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశారని, తగు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన ఒక మహిళ తనకు గ్రామంలో 52సెంట్ల స్థలం ఉన్నట్టు, ఆ స్థలానికి పక్కన ఉన్న వ్యక్తి ఏడు సెంట్లు ఆక్రమించుకొని ఇబ్బంది పెడుతున్నాడని ఫిర్యాదుచేసింది. పిడుగురాళ్ళ మండలం జానపాడు గ్రామానికి చెందిన సాతులూరి అజయ్ అనే వ్యక్తి రెవెన్యూ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన మరొక వ్యక్తికి సుమారు రూ.30 లక్షలు ఇచ్చినట్టు, సదరు వ్యక్తి డబ్బులు తిరిగి ఇవ్వకుండా, ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడని, తగున్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీసు సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. ప్రజలకు దాతలు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని అధికారులు స్వయంగా వడ్డించారు.

శావల్యాపురం తహసీల్దార్, ఎస్ఐ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ లక్ష్మీలావణ్య

శావల్యాపురం, ఫిబ్రవరి 5: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల తహసీల్దార్‌గా నక్కా లక్ష్మీలావణ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె సీసీఎల్ ఆఫీస్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీలో భాగంగా శావల్యాపురం తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు డిప్యూటీ తహసీల్దార్ వెంకట నాగరాజు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన తహసీల్దార్ లక్ష్మీలావణ్యను వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్ఏలు సాదరంగా ఆహ్వానించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల సబ్ ఇన్స్పెక్టర్‌గా చల్లా సురేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిలకలూరిపేట పట్టణ ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీలలో భాగంగా శావల్యాపురానికి వచ్చారు. ఇప్పటివరకు ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన తిరుపతిరావు స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీఅయ్యారు. బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన ఎస్ఐ సురేష్‌ను పోలీస్ సిబ్బంది సాదరంగా ఆహ్వానించి సత్కరించారు.



ఎస్ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్



నూతన తహసీల్దార్ ఉషారాణితో కార్యాలయ అధికారులు, సిబ్బంది

రొంపిచర్ల తహసీల్దార్‌గా ఉషారాణి

రొంపిచర్ల, ఫిబ్రవరి 5: రొంపిచర్ల మండల తహసీల్దార్‌గా ఎస్ ఉషారాణి సోమవారం విధుల్లో చేరారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆమె ప్రకాశం జిల్లా జరుగుమల్లి నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. సిబ్బంది, వీఆర్‌వోలతో మాట్లాడారు. మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆమె తెలిపారు.

చిలకలూరిపేట తహసీల్దారుగా జ్వాలా నరసింహం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 5: చిలకలూరిపేట కొత్త తహసీల్దార్‌గా సోమవారం ఎం జ్వాలానరసింహం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రకారం జిల్లా కురిచేడు మండలం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఈపూరు తహసీల్దారుగా దిలీప్ కుమార్



దిలీప్ కుమార్

ఈపూరు, ఫిబ్రవరి 5: ఈపూరు తహసీల్దారుగా డీ దిలీప్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన ఏవీ సుధాకర్ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం తహసీల్దారుగా పనిచేస్తున్న దిలీప్‌కుమార్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వీఆర్వోలు, సచివాలయం సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాదెండ్ల, ఫిబ్రవరి 5: గణపవరం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. గ్రామంలోని రాజీవ్‌గాంధీ కాలనీ, మేఘనా ఆయిల్ మిల్, సంజీవయ్య గోడౌన్, విజయసారధి, రూరల్ పౌల్ట్రీ తదితర ప్రాంతాలకు సరఫరా నిలిపి వేయబడుతుందని తెలిపారు.

డ్వాక్రా లావాదేవీలు యూపీఐ ద్వారా చెల్లించవచ్చు

● స్త్రీనిధి జిల్లా అసిస్టెంట్ మేనేజర్ చిన్నబుల్లెయ్య

శావల్యాపురం, ఫిబ్రవరి 5: స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకున్న మహిళలు తమ ఖాతానుంచి గానీ, కుటుంబసభ్యుల ఖాతాల నుంచి గానీ యూపీఐ ద్వారా రుణాలు చెల్లించాలని, వీవోఏలకు నగదు చెల్లింపులు చేయరాదని స్త్రీనిధి జిల్లా అసిస్టెంట్ మేనేజర్ రంతు చిన్నబుల్లెయ్య అన్నారు. ఇటీవల డ్వాక్రా రుణాల చెల్లింపులపై వస్తున్న అభియోగాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీసీలు, వీవోఏలతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు మాట్లాడుతూ గ్రామాలలో ప్రతినెలా గ్రామసంఘాల, వీవోల సమావేశాలను వీవోఏలు సక్రమంగా నిర్వహించేలా క్లస్టర్ సీసీలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, డ్వాక్రా పుస్తకాలను వీవోఏలు అక్రమాలకు తావులేకుండా సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఏవైనా అక్రమాలు జరిగితే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డ్వాక్రా సంఘాల లావాదేవీల నిర్వహణలో సీసీలు, వీవోఏలు అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని మండల వైసీపీ నాయకులు ముండ్లమూరి అనిల్‌కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి, మండల సమాఖ్య కార్యదర్శి భారతి, కోశాధికారి వేగుళ్ళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తే ప్రభుత్వ ఉద్యోగం

● కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సులో భరత్‌కుమార్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 5: సివిల్ సర్వీస్‌ను ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తే ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చని హైదరాబాద్ నియో మెంటర్స్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్, సీఈవో ఎం.భరత్‌కుమార్ అన్నారు. సోమవారం నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో సివిల్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎం.భరత్‌కుమార్ మాట్లాడుతూ సివిల్స్ క్రమశిక్షణతో కృషిచేయాలన్నారు. అటవీ శాఖ ఉద్యోగి ఎం.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే సమయపాలన అవసరం అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, టీపీవో ఎం.బాలకోటేశ్వరరావు, కే సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై విస్తృత ప్రచారం

పోట్లూరు (శావల్యాపురం) ఫిబ్రవరి 5: యోగి వేమన జయంతిని పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండలంలోని పోట్లూరు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం విస్తృతస్థాయి ప్రచారాన్ని నిర్వహించారు. చిలకలూరిపేట కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు, చిర్రా వెంకటరామిరెడ్డి, గంగయ్య కోటేశ్వరమ్మ, సామ్రాజ్యం, పోట్లూరు పుల్లయ్య, స్వర్ణ, నరేంద్ర పాల్గొన్నారు.

100 కుటుంబాలు టీడీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 5: పట్టణంలోని 15, 16, 19, 20 వార్డుల నుంచి అధికార వైసీపీకి చెందిన 100 కుటుంబాలకు పైగా యూనిట్ ఇన్‌చార్జి రియల్‌ఎస్టేట్ జానీ, ఆరె శ్రీరాములు, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జీవీ ఆంజనేయులు సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. యువత ఉత్సాహంతో కేరింతల మధ్య పార్టీ చేరికల కార్యక్రమాన్ని పండుగలా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులను ఆయన పార్టీ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనుడు జగన్‌రెడ్డి అని, జాబ్‌క్యాలెండర్ విడుదల చేయక నిరుద్యోగ యువతను మోసం చేశాడని విమర్శలు గుప్పించారు. రోజురోజుకు టీడీపీకి పెరుగుతున్న ఆదరణ చూసి వైసీపీ నాయకులు ఓర్చుకోలేకపోతున్నారని, నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో చాలా గ్రామాల ప్రజలు టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని, నూతనంగా పార్టీలోకి వచ్చిన కార్యకర్తలను గౌరవిస్తూ అందరూ కలిసిమెలిసి పార్టీ కోసం పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోయారని, రానున్న రోజుల్లో టీడీపీ బీసీ ప్రత్యేక చట్టాలు చేయనున్నారన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొనాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్ అక్కరలేదు అనుకుంటే మరోసారి ప్రజలు తప్పుచేయకూడదని అన్నారు. వెన్నుముక లేని నాయకులను ఎన్నుకుంటే రాష్ట్ర భవిష్యత్ నాశనమవుతుందని, ఇప్పటికే వైసీపీ హయంలో 9సార్లు విద్యుత్ బిల్లులు పెంచి నిరుపేదల నడ్డి విరిచిన చరిత్ర జగన్ మోహన్‌రెడ్డిదని, బటన్ నొక్కుడు కార్యక్రమంతో ప్రజల భవిష్యత్ నాశనం చేస్తున్నారని విమర్శించారు. బాధ్యత గల ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం ద్వారా రాష్ట్ర భవిష్యత్‌ను ఉన్నంతగా తీర్చిదిద్దుకోవచ్చని అన్నారు. పట్టణంలో పలు వార్డుల్లో వందలాది కార్యకర్తలు టీడీపీలో చేరడంతో వారిని పేరుపేరున పలకరించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయూబ్‌ఖాన్, క్లస్టర్ ఇన్‌చార్జి పత్తిపూర్ణ, సౌదాగర్ జానీ, పీవీ సురేష్, బొంకూరి రోశయ్య, కాళింగ శ్రీనివాసరావు, అజీజ్, బత్తుల వెంకట్రావు, గోల్డ్ కరిముల్లా, కొండ్రముట్ల సుభాని, న్యాయవాదులు నలబోలు రామకోటేశ్వరరావు, పోట్లూరి సైదారావు, సిద్దయ్య, ముప్పాడి చౌడమ్మ, పత్తేపురం గాలెయ్య, పారెళ్ల సుబ్రహ్మణ్యం, మల్లికార్జున, పువ్వాడ వెంకటకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో దొంగ ఓట్లను గుర్తించండి

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 5: ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీడీపీ విజయంలో కీలకపాత్ర పోషించే ప్రతి అంశాన్ని కేడర్ అందిపుచ్చుకోవాలని క్లస్టర్ బూత్ యూనిట్ ఇన్‌చార్జిలతో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక తిమ్మాయపాలెం రోడ్డులోని వై-కన్వెన్షన్ హాల్‌లో టీడీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని బొల్లాపల్లి, శావల్యాపురం, నూజెండ్ల, ఈపూరు, వినుకొండ మండలాలతోపాటు వినుకొండ పట్టణానికి చెందిన ఐటీడీపీ క్లస్టర్ బూత్ యూనిట్ ఇన్‌చార్జిలతో సోమవారం ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించడం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని, నూతన ఓట్లు చేర్పించడం, డబుల్ ఎంట్రీ ఓట్లను, దొంగ ఓట్లను గుర్తించి వాటిని తొలగించేందుకు అధికారులపై ఒత్తిడి తేవాలని సూచించారు. టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఎన్నికల యుద్ధంలో సైనికుడిగా పనిచేయాలని కోరారు. కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పదవులతో సత్కరించడం జరుగుతుందన్నారు. అధికార పార్టీ నాయకుల సౌలభ్యం కోసం పోలింగ్ బూత్‌లను మార్చుకొని రిగ్గింగ్ చేసే అవకాశాలు ఉన్నచోట పోలింగ్ బూత్‌ల మార్పు అంశంపై అధికారులకు ఫిర్యాదు చేయాలని, అధికారులు వినని పక్షంలో పోరాటం చేసి పోలింగ్ బూత్‌ల మార్పును అడ్డుకోవాలని సూచించారు. ప్రజలకు మేలు జరగాలంటే ఈ రాక్షసపాలన నుంచి విముక్తి పొందేందుకు సమిష్టిగా అందరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు


వినుకొండ టౌన్, ఫిబ్రవరి 5: వైసీపీ బలమైన గ్రామాల్లో జనసేన జెండా పాతాలని, పార్టీ బలం పెంచాలని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను రాయల్ అన్నారు. బొల్లాపల్లి మండలం దోమలగుండం గ్రామానికి చెందిన తోట వెంకటనర్సయ్య ఆధ్వర్యంలో 10 కుటుంబాలు వైసీపీ నుంచి జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ జెండా కప్పి ఆహ్వానించారు. గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వం అన్యాయం చేసిందని, రానున్న రోజుల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలో ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని నాగశ్రీను తెలిపారు. పార్టీలో చేరిన వారికి అండదండలు ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నగరవనం పార్కు పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో విజయ

నగరవనం పార్కు పనుల పరిశీలన

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 5: మండలంలోని వెంకుపాలెం సమీపంలో నూతనంగా 50 ఎకరాల్లో ఏర్పాటుచేస్తున్న నగరవనం పార్కు ప్రదేశాన్ని సోమవారం మాచర్ల సబ్ డీఎఫ్‌వో విజయ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా నగరవనం పార్కు నిర్మాణంపై ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సురేంద్రకు సూచనలు, సలహాలు అందజేశారు. పనుల్లో వేగం పెంచాలని పార్కు ప్రదేశాన్ని సందర్శకులకు అందుబాటులోకి వచ్చేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వినుకొండ ఫారెస్ట్ అధికారి సయ్యద్ హుస్సేన్, ఫారెస్ట్ బీట్ అధికారి నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.



జేఎన్‌టీయూలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లను ప్రారంభిస్తున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు

జేఎన్‌టీయూలో నూతన భవనాల ప్రారంభం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 5: వైసీపీ ప్రభుత్వం రూ.100 కోట్లతో జేఎన్‌టీయూ కళాశాలను అభివృద్ధి చేయడం జరిగిందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం నరసరావుపేట మండలం కాకాని వద్ద జేఎన్‌టీయూ కళాశాలలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఇంకా ఎంతో అభివృద్ధి చేయాల్సింది ఉందన్నారు. కార్యక్రమంలో కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్‌చాన్సులర్ ప్రసాదరాజు, జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, మిట్టపల్లి రమేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

శావల్యాపురం, ఫిబ్రవరి 5: మండలంలోని శానంపూడి-2, మతుకుమల్లి-2 అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్ల పోస్టులు, పోట్లూరు-2 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ శానంపూడి-2 అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఎస్సీ కేటగిరీకి, మతుకుమల్లి-2 అంగన్‌వాడీ టీచర్ పోస్టు, పోట్లూరు-2 అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఓసీ జనరల్‌కు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు వినుకొండ సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఎస్పీని కలసిన సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు



ఎస్పీ రవి శంకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్‌బాబు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 5: ఇటీవల జరిగిన బదిలీల్లో రాజమండ్రి నుంచి సత్తెనపల్లికి డీఎస్పీగా బదిలీ అయిన గురునాథ్ బాబు సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేయాలన్నారు. సబ్ డివిజన్‌లోని అధికారులతో విధులను సమర్థవంతంగా నిర్వహించేలా చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలన్నారు. ప్రజల రక్షణ, భద్రత కోసం కృషిచేయాలన్నారు. విజుబుల్ పోలీసింగ్‌ను పెంచేలా చూడాలని సూచించారు.

ఎస్పీని కలసిన సెబ్ సూపరింటెండెంట్

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 5: పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డిని నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్పీ ఖాజా మొహిద్దీన్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఖాజా మొహిద్దీన్ నరసరావుపేట సెబ్ రెండో సూపరింటెండెంట్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. 1996 బ్యాంచ్‌కి చెందిన కాజా మొహిద్దీన్ ఎక్సైజ్ శాఖలో సీఐగా 25సంవత్సరాల పాటు ప్రకాశం జిల్లాలో పనిచేశారు. అనంతరం ఏఈఎస్‌గా ప్రమోషన్ పొంది ఒంగోలు ఐఎస్ఎంఎల్ డిపోలో అసిస్టెంట్ మేనేజరుగా పనిచేశారు. అనంతరం పదోన్నతిపై పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.

80 మందికి లివర్ పరీక్షలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 5: పట్టణంలోని జానకి నర్సింగ్ హోం ప్రాంగణంలో ఉన్న బలరామకృష్ణ లివర్ అండ్ గ్యాస్ట్రో సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం లివర్ సంబంధిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు జరిగాయి. ఈ వ్యాధులను గుర్తించేందుకు అధునాతన ఫైబ్రోస్కాన్ పరికరంతో సుమారు 80మందికి ఈ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలకు వేల రూపాయలు వ్యయం అవుతున్నప్పటికీ నామమాత్రపు రుసుంతో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో వైద్య నిపుణుడు డాక్టర్ ముప్పాళ్ళ బలరామకృష్ణ, తేజస్వి మాట్లాడుతూ రాబోయే కాలంలో వచ్చే లివర్ వ్యాధులను ఈ పరీక్ష ద్వారా ముందుగానే తెలుసుకోవచ్చునన్నారు. లివర్ పని తీరు కూడా తెలుస్తుందన్నారు. లివర్ వ్యాధులను ముందుగా పసిగట్టి తగిన చికిత్సను అందించవచ్చునని పేర్కొన్నారు. పలువురు రోటరీ క్లబ్ సభ్యులు కూడా పరీక్షలు చేయించుకున్న వారిలో ఉన్నారు.



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వినుకొండ-నడిగడ్డ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

వినుకొండ, ఫిబ్రవరి 5: వినుకొండ నుంచి తిమ్మాయపాలెం, నడిగడ్డ ప్రధాన రహదారికి ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలంటూ తిమ్మాయపాలెం సచివాలయం వద్ద సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బొంకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో కుమ్మరిపాలెం, తిమ్మాయపాలెం, శ్రీరామ్‌నగర్, పానకాలపాలెం, దొండపాడు, రైతునగర్, భారతాపురం, నడిగడ్డ గ్రామాలకు వెళ్లే ప్రజలు గత ఐదు సంవత్సరాలుగా సరైన రోడ్డు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. ఐదేళ్ల క్రితం రహదారి నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం హయాంలో రూ.3కోట్లు నిధులు కేటాయిస్తే పనులు ప్రారంభించేందుకు ఉన్న రోడ్డును తొలగించారని, ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ ప్రాంతంలోని ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయంలో వివిధ గ్రామాలకు చెందిన వారితో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం నాయకులు పెనుమాల వెంకటేశ్వర్లు, నాసర్‌బీ, రాయల అంజయ్య, చల్లా వెంకటయ్య, ఆర్. శివ, ఎం.శివరామకృష్ణ, అంకమరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్‌వో కే వినాయకం, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు

స్పందనకు 120 ఫిర్యాదులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 5: పల్నాడు జిల్లా నరరావుపేట కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్‌వో కే వినాయకం, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఉమారాణి, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ పీఏ ముని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 120మంది అర్జీదారులు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చి ఫిర్యాదులు చేశారు. అందిన అర్జీలను సంబంధిత శాఖలకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు రెడ్‌క్రాస్ సొసైటీ ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

జగన్‌ను ఇంటికి పంపటమే లక్ష్యంగా పనిచేయాలి

● కార్యకర్తలతో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, ఫిబ్రవరి 5: నిరంకుశ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపటమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని తూబాడులో టీడీపీ, జనసేన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలు తప్ప క్షేత్ర స్థాయిలో అభివృద్ధి లేదన్నారు. రాష్ట్రంలో నయా నియంతలను మించిన రీతిలో పాలన సాగుతుందన్నారు. చంద్రబాబుతోనే భావితరాలకు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యకర్తలు వైసీపీ పాలనలో టీడీపీ, జనసేన నాయకులపై అన్యాయంగా కేసులు పెట్టారని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ, జనసేన సమన్వయకర్తలు నెల్లూరి సదాశివరావు, రాజా రమేష్, పార్టీ అధ్యక్షుడు బీ సత్యనారాయణ, నాయకులు డీ వెంకటేశ్వర్లు, సీహెచ్ నాగేశ్వరరావు, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ కృష్ణవేణికి అభినందనలు తెలియజేస్తున్న మున్సిపల్ అధికారులు

వినుకొండ కమిషనర్‌గా కృష్ణవేణి

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 5: త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో కమిషనర్‌గా పనిచేస్తున్న కృష్ణవేణిని వినుకొండ కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో మున్సిపల్ ఆర్డీవో ఆఫీస్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన సమయంలో అందరికీ సుపరిచితురాలు. విధినిర్వహణలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ కృష్ణవేణికి మున్సిపల్ అధికారులు అభినందనలు తెలియజేశారు.

యడ్లపాడు తహసీల్దార్‌గా ఆఫ్రపున్నీసా బేగం



తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అఫ్రపున్నీసా బేగంకు శాలువా కప్పి సత్కరిస్తున్న డీటీ శ్యామలత, సిబ్బంది

యడ్లపాడు, ఫిబ్రవరి 5: యడ్లపాడు మండల తహసీల్దార్‌గా ఎండీ అఫ్రపున్నీసా బేగం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆమె రాజుపాలెం మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. కాగా ఇప్పటివరకు తహసీల్దార్‌గా పనిచేసిన కుటుంబరావు గిద్దలూరుకు బదిలీఅయ్యారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అఫ్రపున్నీసాబేగంను, బదిలీపై వెళుతున్న కుటుంబరావును డీటీ శ్యామలత, ఆర్ఐ చక్రవర్తి, వీఆర్వోల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేపీ చారి, ప్రేమరాజు, కార్యాలయ సిబ్బంది శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలిపారు.

వినుకొండ తహసీల్దార్‌గా బ్రహ్మయ్య



తహసీల్దార్ పి.బ్రహ్మయ్య

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 5: వినుకొండ తహసీల్దార్‌గా పి.బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఈయన బాపట్ల జిల్లాలోని ఇంకొల్లు మండలం నుంచి వినుకొండకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో వినుకొండ తహసీల్దార్‌గా పనిచేసిన బి.కిరణ్‌కుమార్ ప్రకాశం జిల్లాకు కొండెపికి బదిలీ అయినట్లు సిబ్బంది తెలిపారు.

నాదెండ్ల తహసీల్దార్‌గా వర కుమార్

నాదెండ్ల, ఫిబ్రవరి 5: మండల తహసీల్దార్‌గా డీవీబీ వరకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా బేస్తవారిపేటలో పనిచేస్తూ బదిలీ చేస్తూ ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను డిప్యూటీ తహసీల్దార్‌గా అనురాధ, ఆర్ఐ షేక్ రమీజా, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ మురహరి, ఆపరేటర్ వాసు తదితరులు మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు.

పీఏయూడీఏ పాలకవర్గం, సభ్యుల వివరాలు తెలియజేయాలి

● ఎంఐఎం నేత షేక్ కరిముల్లా

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 5: పల్నాడు జిల్లా నరసరావుపేటలో పీఏయూడీఏ ఏర్పడ్డ తర్వాత ప్రభుత్వ సంస్థగా పాలకవర్గం, సభ్యుల వివరాలు, వారికి అప్పగించిన బాధ్యతలు తెలియజేయాలని ఎంఐఎం నేత షేక్ కరిముల్లా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా షేక్ కరిముల్లా మాట్లాడుతూ పీఏయూడీఏ ప్రభుత్వ సంస్థగా ప్రజలకు ఎటువంటి ఉపయోగాలు ఉన్నాయో చెప్పాలన్నారు. నరసరావుపేటలో నగర శివార్లలో పొలాలకు లేఅవుట్‌లు వేసి అప్రూవల్ లేకుండా వేసిన వెంచర్లు ఎన్ని ఉన్నాయో తెలియజేయాలన్నారు. వివరాలతో సమాచార హక్కు కింద దరఖాస్తుచేసుకున్నా పీఏయూడీఏ కార్యాలయం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. దీనిపై ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపించారు.